Rs. 12/- per copy

UESI
ANDHRA PRADESH

# విద్యార్థి జ్వాల

Vol. 29 - No.8

June 2023



## క్రైస్తవ నాయకత్వం
### దేవుని రాజ్య విస్తరణ కోసమే

ఎడిటోరియల్

# దేవుని రాజ్యమే మన లక్ష్యం

కర్నాటకలో ఎన్నికలు ముగిసి కాంగ్రెస్ అధికారాన్ని చేజిక్కించుకొంది. ఇంకా ఎన్నికలు జరగాల్సిన రాష్ట్రాల్లోని ప్రధాన పార్టీలు అధికారం కోసం ఎన్నో ఎత్తులు, పైఎత్తులు వేస్తున్నారు. ఈ క్రమంలో ఒకరినొకరు తీవ్రమైన పదజాలంతో దూషించుకోవడం, హానిచేసుకోవడం, కోర్టులకెళ్ళడం, భయాందోళనలకు గురిచేసుకోవడం, కుల, మతాల ప్రకారం విభజించడం, ఒకరిమీద మరొకరు ద్వేషాన్ని వెళ్ళగక్కడం, వెన్నుపోటులు, కుళ్ళు, కుతంత్రాలు, డబ్బును విచ్చల విడిగా పంచడం, ఆశ చూపించడం... ఇవన్నీ అధికారాన్ని చేజిక్కించుకోవడం కోసమే. అధికారాపేక్ష ఎలాంటి అడ్డదారులనైనా తొక్కించి అనైతిక, నీచమైన పనులనైనా చేయిస్తుంది. పార్టీలు, నాయకులు పైకి 'ప్రజలకు సేవచేయడమే లక్ష్యం' అని చెబుతున్నా, ఆంతర్యంలో మాత్రం 'అధికారమే లక్ష్యం'.

ఈ రాజకీయాలు సంఘాలకు, సంస్థలకు కూడా పాకి ఆత్మీయ విలువలు క్రమక్రమంగా అంతరించడం వలన లోకాన్ని ప్రభావితం చేయాల్సిన సంఘంలోకి లోకమే చొచ్చుకొచ్చింది. పైకి ఆత్మీయత అని చెబుతున్నా ఆత్మీయతను పక్కన పెట్టి పెద్దలు, నాయకుల ఆంతర్యంలో అధికారం, పెత్తనమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. జీవము గలిగిన దేవుని సంఘంలో, జీవంలేని/ఆత్మీయంగా చచ్చిన వారు నాయకత్వంలోకి వచ్చి స్థానాలను ఆక్రమిస్తుంటే, మరికొంతమంది దేవుని రాజ్యాన్ని కట్టడానికి బదులు తమ స్వంత రాజ్యాల్ని కట్టుకొంటున్నారు.

దేవుని రాజ్యము ఒక రాజకీయ నాయకుడు కట్టే రాజ్యాన్ని పోలి ఉండదు. యేసుక్రీస్తు తన రాజ్యం ఈ లోక సంబంధమైనది కాదని, అది ఆత్మీయమైన విలువలతో కూడినదని చెప్పి అలాగే జీవించాడు. "కాలము సంపూర్ణమైయున్నది, దేవునిరాజ్యము సమీపించియున్నది, మారుమనస్సు పొంది సువార్త నమ్ముమని చెబుతూ దేవుని సువార్త ప్రకటించాడు" (మార్కు1:15). "మీరు ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడని" కొండమీద ప్రసంగంలో చెప్పాడు (మత్తయి 6:33). దేవుని రాజ్యము భోజనమును పానమును కాదు గాని, నీతియు సమాధానమును పరిశుద్ధాత్మయందలి ఆనందమునైయున్నది (రోమా14:17) అని అపొస్తలుడైన పౌలు చెబుతాడు.

'దేవునిరాజ్యాన్ని' భారతదేశంలో విస్తరింప జేయడానికి తమ సొంత ఇల్లు, దేశాలు, కుటుంబాలు, సంస్కృతిని త్యజించి 'దేవుని రాజ్య స్థాపన' అనే పనికి మిషనరీలు, అనేమంది దైవసేవకులు, యుఇయస్ఐ పితరులు పూనుకున్నారు. త్యాపూరితంగా, క్రీస్తునుపోలి జీవిస్తూ, ఆయన సేవాపొలములో కూలివారిగా, కావలి వారిగా, పనిచేశారు. గనుక యుఇయస్ఐలోని ప్రతి విద్యార్థి, గ్రాడ్యుయేట్, స్టాఫ్ 'దేవుని రాజ్యం' కోసమే ప్రార్థిస్తూ, నశించిపోయే విద్యార్థుల మధ్య పనిచేయాలి.

'ఎక్లీషియా' అన్న గ్రీకు పదానికి సంఘము అనే పదాన్ని తెలుగు బైబిల్ తర్జుమాలో వాడారు. 'ఎక్లీషియా' అన్న పదం చరిత్రలో కేవలం యేసు మాత్రమే వాడలేదు. ఆయన కంటే ముందు గ్రీకులు తమ జ్ఞానాన్ని, తత్వ శాస్త్రాన్ని పలుదేశాలకు చేరవేయడానికి, వారి ప్రభావాన్ని ఇతర దేశాలపై చూపడానికి, వారు చెరపట్టిన రాజ్యాలలోనికి "ఎక్లీషియా" అనే ఒక స్వతంత్ర లేక స్వచ్ఛంద మానవ గుంపును పంపేవారు. వారు జీత భత్యాలకు గాక గ్రీకు తత్వానికి, వారి సాంస్కృతిక, సామాజిక జీవన విధానాలకు కట్టుబడిన అంకిత భావం కలవారై వెళ్ళిన ప్రతి చోటా గ్రీకు సంస్కృతి, తత్వాన్ని నూరి పోసేవారు. తర్వాత రోమీయులు గ్రీకులను ఓడించి రాజ్యం పొంది వారు కూడా "ఎక్లీషియా" అనే సమాజాన్ని కైసరు మహిమ, యుద్ధ పటిమ, భవన నిర్మాణ సాంకేతికత, ధరించే బట్టలు, వైభవం మొదలైన వాటిని వారు చెరపట్టిన రాజ్యాలలో విస్తృతం చేయడానికి ఉపయోగించారు. ఆ నేపథ్యంలో యేసు తన శిష్యులను 'ఎక్లీషియా' అని పిలిచాడు. అప్పటికే ఆయన పుట్టి పెరిగిన సంస్కృతిలో 'సినగోగు' లేక 'సమాజ మందిరం' అనే సంస్కృతి ఉంది.

మతమే గనుక ఆయనకు ప్రధానమైతే ఆయన ఇంకో సినగోగు స్థాపించేవాడు కానీ యేసుకున్న ప్రధాన లక్ష్యం ఆయన రాజ్యం గనుక ఆ రాజ్య స్థాపనకు అనువైన పద్ధతి అయిన 'ఎక్లీషియా' అనే సమాజాన్ని ఎన్నుకున్నాడు. "ఎక్లీషియాగా" పిలిచిన తన శిష్యగణం, ఆదిమ సంఘం ప్రపంచాన్ని 'యేసే' 'క్రీస్తు' లేక 'రాజు/ప్రభువు' అనే భావజాలంతో లేక సువార్తతో తల క్రిందులు చేయసాగారు.

విశ్వాసుల ప్రధాన లక్ష్యం చచ్చిపోయాక పరలోకం పోవడం కాదు గానీ బ్రతికుండగానే దేవుని రాజ్యాన్ని నిర్మించడం. దేవుని చిత్తం కేవలం క్రైస్తవ సంఘాల్లో, క్రైస్తవుల ఇళ్ళల్లోనే అని ఆలోచించే వారంతా అక్కడితోనే ఆగిపోతారు. దేవుడు అందరికీ తండ్రియని, ఆయన చిత్తం పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమిమీద అన్ని రంగాల్లో, అన్ని కుటుంబాల్లో అన్ని సమాజాల్లో, అన్ని ప్రభుత్వాలలో నెరవేరాలన్నది దేవుని ఆశ. ఆ దిశగా వ్యూహం, ఆ దిశగా ప్రణాళికతో కూడిన కార్యాచరణ చేయడం యుఇయస్ఐలోని ప్రతి ఒక్కరి కర్తవ్యం. గనుక ప్రార్థన చేద్దాం (మత్తయి 6:9-10), ప్రయాసపడదాం, ప్రభువు కార్యాభివృద్ధియందు ఎప్పటికీ ఆసక్తులై ఉందాం (1 కొరింథీ 15:58)

– పి. సునీల్ జాకబ్




Vol. 29, No.8 June 2023
A Publication of
UESI Publication Trust

EDITORIAL BOARD:

Mr. B.J. Lazarus, Honorary Editor
Mr. P. Sunil Jacob - Editor
Dr. J. Ratna Grace - Member
Dr. M. Solomon Raju - Member
Mrs. K. Martha - Member
Mr. B. Jason - Member
Mr. G. Leela Narayana - Member
Dr. J. Subbarao - Sec., Litt.Dept.

CONTACT:

The Editor, Vidyarthi Jwala,
UESI-AP - Study Centre, # 19-37,
Abhishek Nagar, Nambur - 522 508
Ph: 0863-2293319, 9299997087
Email: editorvj@gmail.com

GIFTS & SUBSCRIPTIONS:

Can be made by Cheque/DD/MO
in favour of UESI-AP,
Abhishek Nagar, Nambur - 522 508
ANNUAL: GRADUATES - Rs.250
STUDENTS - Rs. 120
LIFE INLAND - Rs. 2000
LIFE OVERSEAS - US $ 150

VIDYARTHI JWALA ACCOUNT NO:

**SBI - 36698741798**
**IFS Code: SBIN0011994**
**uesiap vj, Nambur Branch**

GENERAL CONTRIBUTIONS ACCOUNT NO:

**SBI - 10949477628**
**IFS Code: SBIN0000844**
**Commercial Branch, Guntur**

LITERATURE ACCOUNT NO:

**SBI - 36698741437**
**IFS Code: SBIN0011994**
**uesiap pt, Nambur Branch**

**Please inform/ SMS to**
**Mr. A. Venu, Accountant (9849516060)**
**Email: <uesiapacc84@gmail.com>**

TOPICS:

July: Testimony in College
August: UESI Cutting Edge
September: Unity
October: Power through Prayer
November: Fear of God
December: The Uniqueness of Jesus Christ

**Note:** Please send your writeups on or before
**10th of every month**

# నీవు ఎవరిలా ఉన్నావు?



నీ దర్శనం నీ సమయాన్ని వినియోగించడం, స్నేహితులు, అలవాట్లు, వైఖరులు, చదివే పుస్తకాలు, క్రమశిక్షణ, జీవన విధానం సమస్తం నిర్ణయిస్తుంది. కొన్నిసార్లు దర్శనం గ్రహించినా దానికి కట్టుబడి ఉండడం, కొనసాగడం, నిబద్ధతతో పనిచేయడం కష్టమవుతుంది. మధ్యలో వచ్చే శోధనలు, తాత్కాలిక సుఖాలు, పేరు ప్రఖ్యాతులకై ఆరాటాలు, పెత్తనాలకై పోరాటాలు గురితప్పేలా చేస్తాయి. సాతాను వేసే బలహీనతలనే వలలో చిక్కుబడే ప్రమాదం ఉంది. అందుకే "నీ కనురెప్పలు ఇటు అటు చూడక సరిగాను, నీ కనురెప్పలు నీ ముందర సూటిగాను చూడవలెను" (సామె 4:25) అని బైబిల్ చెబుతుంది.

ఈ లోకంలో ప్రధానంగా మూడు రకాల వ్యక్తులు ఉంటారు - దేనినైనా సాధించేవారు, సాధించలేము అనేవారు, సాధించే వారిని అడ్డగించేవారు; పనులు చేసేవారు, చేసేది చూసేవారు, చూసి ఆశ్చర్యపోయేవారు; పని చేయడానికి సొంతంగా కదిలేవారు, కదిలిస్తే కదిలేవారు, కదిలించినా కదలనివారు. నీవు ఎవరిలా ఉన్నావు?

## లోపలి పేజీల్లో...

❈ దేవుని రాజ్యమే మన లక్ష్యం - 2
❈ ప్రవర్తనే నాయకుని విలువ - 4
❈ అహం లక్షణాలు - 7
❈ నాయకత్వం ఒక హోదా కాదు - 8
❈ సమర్థవంతమైన నాయకులను తయారు చేయాలి - 12
❈ ప్రేషిత సేవలో పాల్గొందాం - 15
❈ విలువ తెలిసింది - 18
❈ ప్రభువు ఎక్కడ ఆజ్ఞాపిస్తే అక్కడ పని చేయడమే - 19
❈ హలో...నాయకా! - 23
❈ నీ శిష్యునిగా... - 25
❈ ఆధ్యాత్మిక నాయకుడు - 27
❈ పరిచర్యకు దర్శనం ప్రభువు సన్నిధిలోనే...- 28
❈ కోశాధికారి లేఖ - 31
❈ నాయకుడంటే నీలా ఉండాలి! - 32

కవర్ కథనం

# ప్రవర్తనే
## నాయకుని విలువ


క్రైస్తవ జీవితంలో నాయకుని ప్రవర్తన చాలా ప్రాముఖ్యమైనది. "ఒక వ్యక్తికి ఏముంది, అతనేమి చేస్తాడు అనే దానికన్నా అతడు ఎలాంటివాడు అన్నదే చాలా ప్రాముఖ్యం". మన నైపుణ్యాలు మన గొప్పతనాన్ని తెలియజేస్తాయి. మన పని మన సామర్థ్యాన్ని తెలియజేస్తుంది, కానీ మన ప్రవర్తన మన విలువను తెలియజేస్తుంది.

నేటి క్రైస్తవ సమాజంలో స్థానిక సంఘాలు, సంఘ అనుబంధ సంస్థలు, శాఖలు మొదలగు వాటిలో ఈ ప్రవర్తన గూర్చి చాలా తీవ్రమైన సమస్యలు ఉన్నాయి. విశ్వాసులు దీనిపై దృష్టిపెట్టకుండా, మిగిలిన విషయాల పై అంటే, బోధించడం, సౌవార్తీకరణ, సంఘాల ను కట్టడం, నడిపించడం, ఇతర పరిచర్యలు.. మొదలైనవాటిపై దృష్టిపెడుతున్నారు. ప్రభువిచ్చిన విలువైన పరిచర్యను విలువలులేని జీవితాలతో చేస్తున్నారు. అందువల్ల క్రైస్తవ పరిచర్య సమాజంలో చూపించాల్సినంత ప్రభావాన్ని చూపించలేకపోతుంది.

యుఇయస్ఐ విద్యార్థులు, గ్రాడ్యుయేట్స్, స్టాఫ్ వర్కర్స్ అందరూ నాయకులుగా ఉండి పరిచర్యలో పాల్గొంటారు. క్రైస్తవ పరిచర్యలో సేవతో పాటు నాయకుని ప్రవర్తన చాలా ప్రాముఖ్యమైనది. నాయకుని జీవితంలో ఆత్మఫలము - ప్రేమ, సంతోషము, సమాధానము, దీర్ఘశాంతము, దయాళుత్వము, మంచితనము, విశ్వాసము, సాత్వికము, ఆశానిగ్రహము అను తొనలు దిన దినము పరిపక్వత చెందాలి (గలతీ 5:22). యువ నాయకుడైన తిమోతికి, పౌలు రాస్తూ, మాటలోను, ప్రవర్తనలోను, ప్రేమలోను, విశ్వాసములోను, పవిత్రతలోను, విశ్వాసులకు మాదిరిగా ఉండాలని కోరాడు (1తిమోతి 4:12). క్రీస్తు స్వరూపం వారిలో కనబడాలి. ఒక ఇంటిని కర్ర, గడ్డి, కొయ్యకాలుతో కట్టవచ్చు కానీ అగ్ని పరీక్షలో అది కాలిపోతుంది. వెలగల విలువైన వస్తువులతో నిర్మించినప్పుడు ఆ ఇల్లు నిలుస్తుంది. క్రైస్తవ నాయకుని జీవితం అట్టి విలు వైన ఆధ్యాత్మిక విషయాలతో కట్టబడినప్పుడు దేవునికి ఇష్టునిగా ఉండగలడు, సేవ ఫలభరితంగా ఉంటుంది. క్రైస్తవ నాయకుని ప్రవర్తన ఎలా ఉండాలో కొన్ని విషయాల్ని చూద్దాం.

### క్రమమైన ప్రార్థనా జీవితం

క్రైస్తవ నాయకుడు ప్రార్థనాపరుడై ఉండాలి. యేసు ప్రభువు ప్రార్థనా జీవితం మనకు ఎంతో మాదిరిగా ఉంది, ఆయన పెందలకడనే లేచి అరణ్య ప్రదేశానికి వెళ్ళి ఏకాంతంగా చేసిన ప్రార్థన, పరిచర్య ప్రారంభానికి ముందు 40 దినాలు ఉపవాస ప్రార్థన, శిష్యులను ఏర్పరచకముందు ప్రార్థనలో గడపడం, ఆయన మరణించే ముందు రాత్రి గెత్సెమనే తోటలో ప్రార్థించడం, ఆయన ప్రార్థనా జీవితానికి కొన్ని ఉదాహరణలు. ప్రార్థన లేని జీవితం వర్షాలు రాని మబ్బులు లాంటిది. ఫలవంతంగా వాడబడే క్రైస్తవ నాయకుడు ప్రార్థనా పరుడుగా ఉంటాడు. ప్రపంచ ప్రఖ్యాత సువార్తికుడు బిల్లీగ్రాహం తన ఫల భరిత పరిచర్యకు రహస్యం, ప్రార్థనే అని చెబుతాడు. దానియేలు అతిశ్రేష్ఠమైన బుద్ధిగల వాడుగా ఉండి, ముప్పది దినముల వరకు రాజు యొద్ద తప్ప ఏ దేవుని యొద్ద గాని,



నాయకుని ప్రవర్తనలో సాత్వికం ఎంతో అవసరం. ఒకసారి మచిలీపట్టణంలో కళాశాల హాస్టల్ అంతా చాలా అల్లరిగా ఉంది. విద్యార్థులంతా భయంకరంగా అరుస్తున్నారు. ఇద్దరు వార్డెన్స్‌పై ఆగ్రహంతో ఊగిపోతున్నారు. కారణం హాస్టల్లో ఒక చిన్న సమస్య. విషయాన్ని ఛీఫ్ వార్డెన్‌కు తెలియజేశారు. ఆయన ఆ విద్యార్థుల కాలేజ్‌లో లెక్చరర్ కూడా. ఆయన వచ్చి విషయం అడిగి తెలుసుకొన్నారు. నినాదాలు చేస్తున్న విద్యార్థులు ఉన్నప్పడే డిప్యూటీ వార్డెన్‌తో ఆయన ఇలా అన్నాడు. "మనం వారికి సేవకులం, వారికి కావలసినవి మనం చేసి పెట్టాలి, అలా చేయండి". ఇలా సాత్వికంతో ఆయన చెప్పే సరికి విద్యార్థులు ఆశ్చర్యపోయి ఇక ఏమీ మాట్లాడలేక అక్కడ నుంచి నిష్క్రమించారు. ఆయన ఎవరో కాదు, మన సీనియర్ గ్రాడ్యుయేట్ దీనబంధు అన్న.



మానవుని యొద్ద గాని ఏ మనవి చేయకూడదనే శాసనం ఉన్నప్పటికి, అతడు యథావిధిగా ముమ్మారు మోకాళ్ళని ప్రార్థన చేస్తూ దేవునిని స్తుతించినట్లు చూస్తాము. దానిని బట్టి అతడు సింహముల గుహలో వేయబడ్డాడు. కానీ ఆ రాజ్యంలో గొప్ప దైవికమైన ప్రభావాన్ని చూపగలిగాడు. దానియేలును గూర్చి రాజు స్వయంగా ఇలా సాక్ష్యమిచ్చాడు - దానియేలు అనుదినము సేవించుచున్న దేవుడే అతనిని రక్షించాడని, ఆయనే జీవము గల దేవుడని (దాని.6: 26-27). చైనా ఇన్‌లాండ్ మిషన్ స్థాపకుడైన హడ్సన్ టేలర్ - 'సూర్యుడు ఉదయించక మునుపే కొన్ని గంటలు ఏకాంత ధ్యానములో గడిపేవాడు. తాను మోకాళ్ళపై నుండగా సూర్యుడు తనను చూడడం అరుదు' అని సాక్ష్యమిచ్చాడు. యుఇయస్ఐ పరిచర్యలో నాయకు లుగా సేవ చేస్తున్న మన ప్రార్థనా జీవితం ఎలా ఉంది?

ప్రార్థన ద్వారా దేవునితో వ్యక్తిగత సమయం మనల్ని శక్తివంతులుగా చేస్తుంది. దేవుని చిత్తం మనకు తెలుస్తుంది. మన బలహీనతలను దిద్దుకొనగలం. మనం చేస్తున్న పరిచర్యకు కావలసిన మార్గదర్శకం అనుగ్రహించబడుతుంది. యోహాను 15వ అధ్యాయంలో - ద్రాక్షవల్లిలో నిలిచి ఉండే తీగెలు ఎట్లు ఫలిస్తాయో ప్రభువు చెప్పాడు. వాక్య ధ్యానం, ప్రార్థనల ద్వారా ఆయనలో వ్యక్తి గత సమయాన్ని కలిగి ఉన్నప్పుడు ఆయన నుంచి శక్తి పొందుతాము. మోషే దేవునితో గడిపి సీనాయి కొండ దిగినప్పుడు అతడి ముఖము ప్రకాశించినట్లు రాయబడింది. ఇశ్రాయేలీయులను నడిపించుటకు కావలసిన శక్తి మోషే దేవునితో సహవాసం ద్వారా పొందుతూ వచ్చాడు.

## తగ్గించుకోవడం

యేసు ప్రభువు గొప్ప గురువు, ప్రభువైయుండి తన్నుతాను తగ్గించుకొన్నాడు. క్రీస్తు ప్రభువుకు ఉన్న ఈ తగ్గింపు మనసు నాయకులుగా ఉండే మనందరి కి అవసరం. ప్రభువు శిష్యుల పాదాలు కడిగి మాదిరి చూపాడు. ప్రభువు చెప్పాడు - ప్రభువును బోధకుడనైన నేను మీ పాదాలు కడిగిన యెడల మీరు కూడా ఒకరి పాదములు ఒకరు కడగాల్సిందే. రాజదండం లాంటి నిరంకుశ నాయకత్వానికి, స్వార్థ నాయకత్వానికి, అధికారం చెలాయించడానికి క్రీస్తు పరిచర్యలో తావులేదు. మోషేకి ఐగుప్తులో రాజదండం ఉండేది. దేవుని ప్రజలను ఐగుప్తు దాస్య శృంఖలాల నుంచి విడిపించడానికి అది సరిపోతుందని అనుకొని ప్రయత్నించాడు, చివరికి విఫలమయ్యాడు. ఒక రోజు దైవ దర్శనం కలిగింది, దేవుని కర్ర చేతికి వచ్చింది. దేవుని సన్నిధిలో దీనుడయ్యాడు. దేవుని చేత వాడబడిన గొప్ప సేవక నాయకుడయ్యాడు.

నాయకుని ప్రవర్తనలో సాత్వికం ఎంతో అవసరం. ఒకసారి మచిలీపట్టణంలో కళాశాల హాస్టల్‌లో చాలా అల్లరిగా ఉంది. విద్యార్థులంతా భయంకరంగా అరుస్తున్నారు. ఇద్దరు వార్డెన్స్‌పై ఆగ్రహంతో ఊగిపోతున్నారు. కారణం హాస్టల్లో ఒక చిన్న సమస్య. విషయాన్ని ఛీఫ్ వార్డెన్‌కు తెలియజేశారు. ఆయన ఆ విద్యార్థుల కాలేజ్‌లో లెక్చరర్ కూడా. ఆయన వచ్చి విషయం అడిగి తెలుసుకొన్నారు. నినాదాలు చేస్తున్న విద్యార్థులు ఉన్నప్పుడే డిప్యూటీ వార్డెన్‌తో ఆయన ఇలా అన్నాడు. "మనం వారికి సేవకులం, వారికి కావలసినవి మనం చేసి పెట్టాలి, అలా చేయండి". ఇలా సాత్వికంతో ఆయన చెప్పే సరికి విద్యార్థులు



యుఐయస్‌ఐ-ఏపి ప్రథమ స్టేట్ సెక్రటరీ పి.అగస్టీన్ గారు ఏదైనా విషయం తనకు తెలియకపోతే క్షమించండి, నాకు ఆ విషయం తెలియదు, నేను తెలుసుకోవాలి అని చెప్పేవారే గాని ఏదో ఒకటి మాట్లాడడానికి, కవర్ చేయడానికి ప్రయత్నించేవారు కాదు.

ఆశ్చర్యపోయి ఇక ఏమీ మాట్లాడలేక అక్కడ నుంచి నిష్క్రమించారు. ఆయన ఎవరో కాదు, మన సీనియర్ గ్రాడ్యుయేట్ దీనబంధు అన్న. నాయకత్వంలో ఉండేవారు ఎంతటి వారైనా ఇలాంటి దీన మనసు కలిగిన వారై ఉండాలని ప్రభువు కోరుతున్నాడు.

## యథార్థత

నీతి గల పెదవులు రాజులకు సంతోషకరములు యథార్థవాదులు వారికి ప్రియులు (సామె. 16:13). యథార్థత లేని నాయకులను ప్రజలు అనుసరించరు. యథార్థత అంటే మన మాటలు, చేష్టలు సరిపోవడం లేక మనము అనుసరించేదే మాట్లాడడం. తప్పు చేయకపోవడం కాదు. చేసిన పొరపాటును యథార్థంగా ఒప్పుకోవడం. దావీదును గురించి అపో. 13:36లో అతడు దేవుని సంకల్పం చొప్పున తన తరము వారికి సేవ చేసెనని, అతడు నా ఇష్టానుసారమైన మనుష్యుడు, అతడు నా ఉద్దేశములు నెరవేర్చునని దేవుని యొద్ద మంచి సాక్ష్యము పొందాడు. అతడు బత్షెబాతో పాపము చేసినప్పుడు ప్రవక్తయైన నాతాను యెదుట పశ్చాత్తాపముతో నేను పాపము చేశానని ఒప్పుకొన్నాడు. అందుకే కీర్తన 78:72లో దావీదును గూర్చి అతడు యథార్థ హృదయుడై వారిని పాలించెను, కార్యములయందు నేర్పరియై వారిని నడిపించెనని రాయబడింది. క్రైస్తవ నాయకుడు మంచి తలాంతులు కలిగి సమర్థతతో నేర్పరిగా సేవ చేయుట మాత్రమే గాక జీవితంలో యథార్థత అవసరమైయున్నది. మన యుఐయస్‌ఐ-ఏపి ప్రథమ స్టేట్ సెక్రటరీ పి.అగస్టీన్ గారు ఏదైనా విషయం తనకు తెలియకపోతే క్షమించండి, నాకు ఆ విషయం తెలియదు, నేను తెలుసుకోవాలి అని చెప్పేవారే గాని ఏదో ఒకటి మాట్లాడడానికి, కవర్ చేయడానికి ప్రయత్నించేవారు కాదు.

నేను యుఐయస్‌ఐ - ఏపి ప్రెసిడెంట్‌గా ఉన్నప్పుడు నంబూరులో కట్టడాలు ప్రారంభమైనవి. మొదటి ఫేజ్ నిర్మాణం కొరకు ప్రార్థిస్తున్నప్పుడు టియర్ ఫండ్ అనే క్రైస్తవ సంస్థ దానికి తగిన సొమ్ము ఇవ్వడానికి ముందుకొచ్చి ఇంత సొమ్ము కావాలని ఒక అప్లికేషన్ పెట్టమని కోరారు. అయితే సీనియర్ గ్రాడ్యుయేట్ అన్నలను సంప్రదించి, యుఐయస్‌ఐ పాలసీని గుర్తుచేసుకొని మన ప్రతి అవసరానికి దేవునిమీదే ఆధారపడాలని ప్రార్థనా పూర్వకంగా నిరాకరించాము.

నాయకుల జీవితాల్లో పారదర్శకత ఎంతో ముఖ్యమైనది. మనము పరిచర్య చేస్తున్న ప్రజల మధ్య మన జీవిత వ్యవహారాలు, పరిచర్య సంగతులు తేటగా ఉండాలి. పౌలు తను సేవ చేసే విశ్వాసులకు తన స్వీయ సాక్ష్యాలను గుర్తు చేశాడు. కొరింథీయులకు రాస్తూ, అరమరలేకుండా మీతో మాటలాడుచున్నాను, మా హృదయము విశాలపరచబడియున్నది (2 కొరింథీ 6:11) అని చెప్పాడు. పౌలుకున్న పారదర్శకత మన జీవితాలలో అవసరం.

## దేవునిపై ఆధారపడడం

యుఐయస్‌ఐలో ఉన్న నాయకులంతా వారి వ్యక్తిగత అవసరతల కొరకు గాని, కుటుంబ అవసరతల కొరకు గాని, పరిచర్యలోని అవసరతల కొరకు గాని విశ్వాసంతో దేవునిపై ఆధారపడాల్సి ఉంది. ఒక రిట్రీట్ మొదలుకొని నేషనల్ కాన్ఫరెన్స్‌ల వరకు మన దగ్గర ఏ సొమ్ము లేకుండానే ప్రార్థనతో ప్రారంభిస్తాము. దేవుడు అద్భుతంగా అవసరతలు తీర్చి కృప చూపుతున్నారు. నేను యుఐయస్‌ఐ - ఏపి ప్రెసిడెంట్‌గా ఉన్నప్పుడు నంబూరులో కట్టడాలు ప్రారంభమైనవి. మొదటి ఫేజ్ నిర్మాణం కొరకు ప్రార్థిస్తున్నప్పుడు టియర్ ఫండ్ అనే క్రైస్తవ సంస్థ దానికి తగిన సొమ్ము ఇవ్వడానికి ముందుకు వచ్చారు. అయితే ఇంత సొమ్ము కావాలని ఒక అప్లికేషన్ పెట్టమని కోరారు. అయితే సీనియర్ గ్రాడ్యుయేట్ అన్నలను సంప్రదించినప్పుడు యుఐయస్‌ఐ పాలసీని గుర్తు చేసుకొని ప్రార్థనా పూర్వకంగా నిరాకరించాము. మన అవసరతల కొరకు దేవుని మీద ఆధారపడి మన

సహవాసంలోని సభ్యులకు మాత్రమే వివరాలు తెలిపి ప్రార్థించమని చెబుతాము కాని ఇతర వ్యక్తులకు, సంస్థలకు, సంఘాలకు మనము విజ్ఞప్తి చేయము. మన సహవాసంలోని విద్యార్థులు, గ్రాడ్యుయేట్స్, స్టాఫ్ త్యాగపూర్వకంగా ఇచ్చిన కానుకలతో మొదటి ఫేజ్ కట్టడాలు ముగించాము. తర్వాత కట్టిన కట్టడా లన్నీ అలాగే కట్టారు.

యెహోషాపాతు రాజుపై వివిధ సైన్యాలు దండెత్తినప్పుడు అతడు తన దగ్గర ఎంత సైన్యముంది, వారిని ఎదుర్కోవడానికి ఎంత శక్తి ఉందని ఆలోచించలేదు కాని దేవుని మీద ఆధారపడడం మనము చూస్తాము. దేవుని యొద్ద విచారించడానికి మనసు నిలుపుకొని ఉపవాస దినాన్ని ప్రకటించాడు. ఈ గొప్ప సైన్యముతో యుద్ధము చేయుటకు మాకు శక్తి చాలదు, ఏమి చేయుటకు మాకు తోచదు, నీవే మాకు దిక్కు అని ప్రార్థించాడు. ఆ యుద్ధము దేవుడే జరిగించి యెహోషాపాతుకు జయాన్ని దయచేశాడు (2 దిన 20:1-27).

### జవాబుదారీ తనం

నాయకులందరూ వారి జీవిత వ్యవహారాలను బట్టి, జరిగించే పరిచర్యను బట్టి మొదట దేవునికి లెక్క అప్పగించాల్సి ఉందని గుర్తించాలి. పౌలు కొరింథీయులకు రాస్తూ తాను జరిగించిన క్రియల చొప్పున, అవి మంచివైనను సరే, చెడ్డవైనను సరే, దేహముతో జరిగించిన వాటి ఫలమును ప్రతివాడును పొందునట్లు మనమందరమును క్రీస్తు న్యాయ పీఠము ఎదుట ప్రత్యక్షము కావలయును (2కొరింథీ 5:10) అని తెలియజేశాడు.

ప్రతి నాయకుడు తాను సేవ చేసే సహవాసానికి కూడా జవాబుదారుగా ఉండాలి. మనకు అప్పగించబడిన సేవలో బహు నమ్మకస్తులుగా పనిచేయడం మాత్రమే కాదు, లెక్క అప్పగించాల్సిన వారిగాను, గృహ నిర్వాహకులుగాను ఉండాలి. ఇదే విషయాన్ని పౌలు 1కొరింథీ. 4:1-4లో తెలియజేశాడు. ఫార్మర్ సీనియర్ గ్రాడ్యుయేట్ ప్రొఫెసర్ జి.యి.విజయం గారు "చిత్తశుద్ధితో ఉంటే సరిపోదు కానీ మీరు నిజాయితీగా కనిపించాలి" అని ఒక ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లో నాయకులకు తెలిపారు.

### ముగింపు

విద్యార్థులు, గ్రాడ్యుయేట్స్ నాయకులుగా ఉండి పరిచర్య చేయడం ఒక గొప్ప ధన్యత. ఎందుకంటే వారికి సేవ చేస్తూ ఎల్లప్పుడు మన జీవితాలను సరిదిద్దుకొంటూ ఉంటే క్రీస్తు పోలికలో ఎదుగుతాము. దేవుని పని దేవుని విధానంలో చేయడం యుఇయఫ్ఐలో గొప్ప భాగ్యం. ప్రతి నాయకుడు తన జీవితాన్ని, పరిచర్యను బ్యాలెన్స్ చేసుకోవాలి. తన ప్రవర్తన విషయంలో జాగ్రత్త, బాధ్యత లేని నాయకులు దేవునిని ఘనపరచలేరు, పరిచర్యకు ఆశీర్వాదకరంగా ఉండలేరు. అందుకే హగ్గయి ప్రవక్త ద్వారా అప్పటి నాయకులకు, ప్రజలకు దేవుడు సందేశం పంపి వారి ప్రవర్తనను గూర్చి ఆలోచించమని చెబుతాడు (హగ్గయి 1:6-7). దేవుడిచ్చిన పరిచర్య ఆధిక్యతను శిరసావహించి నిత్యము మన జీవితాలను దేవుని వాక్యపు వెలుగులో సరిచేసుకొంటూ క్రీస్తును పోలిన నాయకులుగా జీవిస్తూ, పనిచేద్దాం. సహవాసానికి ఆశీర్వాదకరంగా ఉందాం.

**- కె. యోహాన్,** తుని

## అహం లక్షణాలు

ఒకరితో పోల్చుకోవడం/పోటీతత్వంతో ఆలోచించడం, నేను గెలవాలి ఎదుటివారు ఓడిపోవాలి, సరిగా వినకపోవడం, సమర్థించుకోవటం, ఫిర్యాదు చేయడం, మొండిగా వ్యవహరించడం, అభద్రతాభావం, తన గురించి తాను చెప్పుకోవడం, ఇతరుల పాపాలు, తప్పులను ఎత్తిచూపడం, అధికారానికి లోబడకపోవడం, బాధించే మనస్తత్వం, తోటివారితో కలిసి పనిచేయలేక పోవడం, వేరే వారి పనులకు నా ఉద్దేశాల ను ఆపాదించడం, విమర్శనాత్మక ధోరణి, నేను పనిచేయక పోవడానికి గల కారణం ఇతరులు అని నిందించడం, తప్పును అంగీకరించక పోవడం, ఎప్పుడూ చింతించడం..మొదలగునవి.

**- వేలంటైన్ దేవిదార్,** చెన్నై



ప్రత్యేకం

# నాయకత్వం ఒక హోదా కాదు

*నాయకత్వం అనేది రాజకీయం కాదు.*
*దేవుని రాజ్య విస్తరణకై దేవుడు మనకందించిన ఆధిక్యత, అవకాశం.*

దర్పం, ఆధిపత్యం, అధికారం, స్వార్థం, హోదా, పలుకుబడి, స్వమహిమ, స్వగర్వం, స్వభద్రత మొదలైన లక్షణాలు ఈ లోకపు నాయకత్వానికి ప్రతీకగా ఉన్నాయి. నాయకుడు ఎంత స్థాయికి ఎదిగితే అంత లోతుగా ఈ వైఖరి పాతుకుపోతుంది. విభిన్న నాయకత్వపు నమూనాలు ఈ ప్రపంచాన్ని పాలించడం వల్ల ప్రజలు గందరగోళంలో పడి వాళ్ళకి అవసరమైన నాయకత్వం ఎలా ఉండాలో నిర్ణయించుకోలేని, ఎంపిక చేసుకోలేని సందిగ్ధావస్థలో ఉన్నారు. క్రైస్తవ ప్రపంచం దీనికేమీ తీసిపోదు. లోకపు నమూనాలను క్రైస్తవ నాయకులు కూడా అలవర్చుకోవడం కారణంగా విశ్వాసులు వాక్యానుసారమైన నాయకత్వాన్ని ఆదర్శప్రాయంగా తీసుకోకుండా లోకానుసారమైన నాయకులను వెంబడించడానికి ఇష్టపడుతున్నారు.

## నాయకత్వం

నాయకత్వం అంటే వ్యక్తులను నడిపిస్తూ, దిశను చూపిస్తూ వారిపై ప్రభావం చూపే సామర్థ్యం. వాక్యానుసారమైన నాయకత్వంలో దేవుడే ఉన్నతమైన నమూనా. ఆయన మాదిరి ఆధారంగా ప్రేమతో నడిపించడం, వివేకంతో అధికారాన్ని వినియోగించడం, హోదాను దుర్వినియోగం చేయకపోవడం అనేది దేవుని చిత్తం. నాయకత్వాన్ని నియంత్రించే అధికారంగా కాక ఇతరులకు సేవ చేసే సాధనంగా అర్థం చేసుకోవాలి. ఒక విశ్వాసి క్రైస్తవ నాయకత్వపు బాధ్యతను అంగీకరించిన వెంటనే తన సొంత ప్రపంచం నుంచి బయటపడి “ఇది నా కోసం అనే దృక్పథాన్ని” పక్కన పెట్టాలి.

వాక్యానుసారమైన నాయకత్వం అంటే క్రీస్తుకు పరిచర్య చేయడంలో ఇతరులను సేవించే సంబంధాల ప్రభావం. అమెరికా సంయుక్త రాష్ట్రాల అధ్యక్షుడు జాన్ ఎఫ్.కెనడి మాటలను తిరగ రాస్తే “క్రైస్తవ నాయకుడు నీ ప్రజలు నీ కోసం ఏమి చేయగలరు అని అడగవద్దు, గానీ నీ ప్రజల కోసం నీవేమి చేయగలవు అని ప్రశ్నించుకో”.

నాయకత్వం అనేది రాజకీయం కాదు. దేవుని రాజ్య విస్తరణకై దేవుడు మనకందించిన ఆధిక్యత, అవకాశం.

అన్ని సమయాలకు, అన్ని సందర్భాలకు,

నాయకత్వానికి మాదిరి క్రీస్తే. నాయకుని సమక్షం, ఉనికి ఉన్నంత కాలం జరిగేవి ప్రాముఖ్యం కాదు గానీ ఆ నాయకుడు లేనప్పుడు ఏం జరుగుతుందనేది ప్రాముఖ్యం. యేసు పరలోకానికి ఆరోహణమైన తర్వాత కూడా ఆయన ప్రభావం ఎంత గొప్పగా ఉందో మనందరికీ తెలుసు. అంతే కాదు ఆయన నాయకత్వంలో ఒక సాధారణ, విభిన్న నేపథ్యాల నుంచి పన్నెండు మంది వ్యక్తులను తీసుకొని, వారిలో మార్పు తీసుకొని వచ్చి ఉద్యమానికి మొదటి తరం నాయకులను తయారుచేశాడు. ఆ ప్రభావాన్ని రెండువేల సంవత్సరాల తర్వాత ఇప్పటికీ చూడగలుగుతున్నాం.

## సేవక నాయకత్వం

"దర్పం చూపే వాడే అసలు సిసలైన నాయకుడు. సేవ చేసేవాడు చేతకాని బలహీనుడు" అనేది ఈ లోకం అభిప్రాయం. కానీ ఇతరులకు సేవ చేయడంలోనే అసలైన బలం ఉందని యేసుప్రభువు తన మాదిరితో చూపెట్టారు. తగ్గడంలో హెచ్చడం ఉంటుందని, వంగితేనే ఎదుగుతామని ఆయన శిష్యుల పాదాలు కడగడం ద్వారా రుజువు చేశారు.

సేవక నాయకత్వం అనేది ఈ లోకపు డిక్షనరీలో లేనే లేదు. నాయకుడు సేవకుడు అంటే నాయకునికి జీవించటం చేతకాదనేది బయట వాళ్ళ ఆలోచన.

ప్రస్తుతం సమాజానికి, సంఘానికి, సహవాసానికి అత్యవసరమైనది సేవక నాయకత్వం. క్రీస్తును అనుసరించేవారు ఒకరిపై ఒకరు ఆధిపత్యం చేసికోకూడదని యేసు బోధించాడు. క్రైస్తవ నాయకత్వం అనేది అణకువతో కూడిన పరిచారం అని ఆయన బోధ, మాదిరితో ఆదర్శప్రాయంగా చూపాడు (మార్కు 10 :42 -45; లూకా 22 :25 -27)

క్రైస్తవ ప్రపంచంలో అది ఒక ఎంపిక కాదు, అనివార్యం, ఎందుకంటే దానికి మూలం, మార్గదర్శి, పురికొల్పు క్రీస్తే కాబట్టి.

### ఎ. అవగాహన కలిగి ఉండాలి

నేనెవరిని? అనే ప్రశ్నకు స్పష్టమైన అవగాహన యేసుకు ఉంది కాబట్టి తన జీవిత లక్ష్యాన్ని ఒక సేవకునిగా నెరవేర్చడంలో ఆయన ఇబ్బంది పడలేదు.

"మనుష్య కుమారుడు పరిచారము చేయించు కొనుటకు రాలేదు గాని పరిచారము చేయుటకును, అనేకులకు ప్రతిగా విమోచన క్రయధనముగా తన ప్రాణము ఇచ్చుటకును వచ్చెనని" (మార్కు 10:45).

**నేను మొట్టమొదటిసారి విద్యార్థిగా సియంటిసికి, కోటగిరి వెళ్ళినప్పుడు నా అతి బరువైన సూట్‌కేస్‌ను అప్పటి సీనియర్ స్టాఫ్ మోయడం, సంఘ నేపథ్యం నుంచి వచ్చిన నాలో ఈ పరిచర్య పట్ల ఎంతో గౌరవాన్ని పెంచింది. ఆ దినాల్లో స్టూడెంట్స్‌కు గ్రాడ్యుయేట్స్ అన్ని రకాల సహాయం చేయడం, వాళ్ళకు పరిచారం చేయడం, గ్రాడ్యుయేట్స్ గృహాల్లో ఇయు స్టూడెంట్స్ కలివిడిగా తిరుగుతూ కుటుంబాలకు అవసరమైన సహాయం అందించడం వంటివి సేవక నాయకత్వంలో ఒక భాగంగా భావించాను.**

ఒక విశ్వాసి దేవునిని ఎంత లోతుగా అర్థం చేసుకుంటే అంతగా తనని, తన పట్ల దేవుని ఉద్దేశాలను అర్థం చేసుకోగలడు.

యోహాను 13:1-3లో మనం గమనిస్తే యేసుప్రభువు శిష్యుల పాదాలు కడగక మునుపు యోహాను ఆయన గురించి కొన్ని విషయాలు రాశాడు.

"తండ్రి తనచేతికి సమస్తము అప్పగించెననియు, తాను దేవునియొద్ద నుండి బయలుదేరి వచ్చెననియు, దేవునియొద్దకు వెళ్ళవలసి ఉన్నదనియు యేసు ఎరిగి" యేసుకు ఆయన ఎవరో ఆయన ఎక్కడి నుంచి వచ్చాడో ఎక్కడికి వెళ్తాడో అనే అవగాహన సంపూర్ణంగా ఉంది. ఈ లోకంలో ఉన్నప్పుడు ప్రతికూల, అనుకూల పరిస్థితులకు ఎంతో ప్రోయాక్టివ్‌గా ఆయన స్పందించేవాడు. ప్రజలు తనను రాజుగా చేయాలని అనుకొన్నప్పుడు ఆయన పొంగిపోలేదు, ఆయనను బయల్జెబూలు అని నిందించినప్పుడు కృంగిపోలేదు. కారణం ఆయనకు ఆయన ఎవరో తెలుసు. అదే దృక్పథంతో ఆ రోజు దాసుని పాత్ర వహించి శిష్యులు పాదాలు కడగడానికి ఏ మాత్రం సంకోచించలేదు. ఆ కాలంలో పాదరక్షలు వేసుకొనేవారు కాదు. కాబట్టి దుమ్ము ధూళి పట్టిన కాళ్ళను చేతిలోకి తీసుకుని వాటిపై నీళ్ళు పోసి కడిగి తుడవడం అనేది ఎవ్వరూ ఊహించని గొప్పసంఘటన.



> ఇటీవల కాలంలో జరిగిన రాష్ట్ర దీర్ఘకాలిక ప్రణాళికలో (యల్ఆర్‌పి-2030) సహితం మెంబర్ కేర్ అవసరతను ఉద్ఘాటించడం జరిగింది. కాపరులు లేని యుఇయస్ఐని ఊహించుకోలేం...
>
> మనకవసరమైంది కాపరి నాయకత్వమే కాని కార్పోరేట్ నాయకత్వం కాదు.

ఆనాటి కాలంలో ఒక రబ్బీ శిష్యుల పాదాలు కడగడం ఊహించని, ఆమోదయోగ్యం కాని పని. ఈనాడు బాహ్యంగా కనిపించే మన తోటి వాళ్ళ కాళ్ళు కడగడం అంత ఇబ్బందేమీ కాకపోవచ్చేమో గానీ దాసుని స్వభావంతో ఎవరకీ కనిపించని మెంటరింగ్ పరిచర్య, త్యాగపూరిత దాతృత్వం, మనలను గాయపరచిన మన పెద్ద, చిన్న సహోదర, సహోదరీలను క్షమించడం వంటి సేవకత్వపు సేవ మనకు పెద్ద సవాలే.

మనం చేసే పనులు ద్వారా మనమేదో కోల్పోతాం అనే ఆలోచన ఇతరులకు పరిచర్య చేయకుండా ఆటంక పరుస్తుంది. బహుశా అందుకే అనేక తరుణాలలో నాయకత్వ బాధ్యతలు వహించే వాళ్ళు కొన్ని పనులు చేయడానికి తటపటాయిస్తారు, సందేహిస్తారు, వాళ్ళ గుర్తింపు కోసం జాగ్రత్తగా ఎంపిక చేసుకొని చేస్తుంటారు. దేవునికి మనస్ఫూర్తిగా సేవ చేయాలని ఆలోచించే ప్రతి నాయకుడు తన సౌకర్యం, తన పేరు, తన గుర్తింపు, తన ఆరోగ్యం, తన వనరులు విరివిగా వెచ్చించడానికి ఇష్టపడుతుంటాడు.

### బి. వినడం నేర్చుకోవాలి

"గౌరవానికి అత్యంత యధార్థమైన విధానాల్లో ఒక విధానం ఇతరులు చెప్పేది వినడం" అంటాడు బ్రైంట్ మెక్గిల్. నాయకత్వ స్థానంలో ఉండే వాళ్ళకి సాధారణంగా ఇది అవలంభించడం కొంత కష్టమే. మనపై మనకు ఆత్మవిశ్వాసం ఉండడం మంచిదే గానీ అంత మాత్రాన వేరే వాళ్ళ అభిప్రాయాలు, ఆలోచనలకు విలువ ఇవ్వకూడదని కాదు. నేపథ్యం, ఉద్యోగ స్థాయి, వయసుతో నిమిత్తం లేకుండా ఒకరి అభిప్రాయాలను ఒకరు గౌరవించుకోవడం ఆధ్యాత్మిక పరిణతికి గుర్తుగా ఉంటుంది. సాధారణంగా మన కమిటీల్లో అది స్టూడెంట్ కమిటీ అయినా కొందరే మాట్లాడుతుంటారు. కానీ మౌనంగా ఉండే వాళ్ళ అభిప్రాయాలను సహితం పరిగణలోనికి తీసుకొని నిర్ణయాలు చేయడం సేవక నాయకత్వంలో భాగం. వినడానికి వేగిరపడడానికి దేవుని సహాయం ఎంతైనా అవసరం (యాకోబు 1 :19). సేవకత్వమే నిజమైన నాయకత్వం. తన బాధ్యత, తన గుర్తింపు, తన స్వార్థం, తన పేరు, పలుకుబడి, తన మాట చెల్లడం గురించి ఆలోచించుకొనే నాయకుడు స్వార్థపూరిత నాయకుడే గాని సేవా తత్పరత కలిగిన నాయకుడు కాదు.

### సి. దేవుడిచ్చిన బాధ్యతగా భావించాలి

క్రైస్తవ నాయకత్వం దేవునినుంచి పొందేదే కానీ మనం వెదికేది, కావాలని కోరుకొంటే దొరికేది కాదు. యేసు ఆయన నాయకత్వ విషయంలోనూ అదే చెప్పాడు. యుఇయస్ఐలో విద్యార్థి, గ్రాడ్యుయేట్, స్టాఫ్ తీసుకొనే బాధ్యతను పదవిలా కాక దేవునిని సేవించడానికి దేవుడప్పగించిన గొప్ప అవకాశం, ఆధిక్యతగా పరిగణించాలే తప్ప తాము పదవిలో ఉన్న కాలంలో తమ పేరు ప్రఖ్యాతులు పెంచుకోవడానికో, తమ ఆలోచనలు, ప్రణాళికలు నేరవేర్చుకోవడానికో కాదు. మన పితరుల జీవిత అనుభవాలను చదివినా, వాళ్ళ జీవితాలను గమనించినా వాళ్ళ జీవన శైలి, చేసే పనులు, వాళ్ళు నాయకత్వపు బాధ్యతలో ఉన్నారనే కనీసపు ఛాయ కూడా కనిపించేది కాదు.

నేను మొట్టమొదటిసారి విద్యార్థిగా సియంటిసికి, కోటగిరి వెళ్ళినప్పుడు నా అతి బరువైన సూట్‌కేస్‌ను అప్పటి సీనియర్ స్టాఫ్ మోయడం, సంఘ నేపథ్యం నుంచి వచ్చిన నాలో ఈ పరిచర్య పట్ల ఎంతో గౌరవాన్ని పెంచింది. ఆ దినాల్లో స్టూడెంట్స్‌కు గ్రాడ్యుయేట్స్ అన్ని రకాల సహాయం చేయడం, వాళ్ళకు పరిచారం చేయడం, గ్రాడ్యుయేట్స్ గృహాల్లో ఇయు స్టూడెంట్స్ కలివిడిగా తిరుగుతూ కుటుంబాలకు అవసరమైన సహాయం అందించడం వంటివి సేవక నాయకత్వంలో ఒక భాగంగా భావించాను.

### భాగస్వామ్య నాయకత్వం

నాయకత్వం అనేది ఒక వ్యక్తి చేసేది, మోసేది కాదు. బాధ్యతను బృందంగా పంచుకొని నెరవేర్చేది. త్రిత్వంలో దాని సంపూర్ణ నేరవేర్పు జరిగిన కారణాన మనం దేవుని కుటుంబంలో పిల్లలమయ్యాము. సమిష్టి నాయకత్వం నిరంతరం సులువైన పరిష్కారం కాదు గానీ అది శ్రేష్టమైన పరిష్కారం.

అది వాక్యానుసారమైంది. ఆశీర్వదింపబడినది, ఆచరణాత్మకమైనది కాబట్టి అది శ్రేష్టమైనది. పంచుకొనే నాయకత్వం, పరస్పరాలంబన, సాధికారత, సహకారాన్ని కలిపి సమిష్టి కృషి అంటాం. భాగస్వామ్య నాయకత్వానికి క్రీస్తు మంచి మాదిరి ఉంచాడు. ఆయన సంపూర్ణ దేవుడు, సంపూర్ణ మానవుడు అయినప్పటికీ ఇతరులతో ఆయన పరిచర్య పంచుకునే అవసరతను చూశాడు. "ఆయన కొండెక్కి తనకిష్టమైన వారిని పిలువగా వారాయన వద్దకు వచ్చిరి. వారు తనతో కూడ ఉండునట్లును దయ్యాలను వెళ్లగొట్టే అధికారము గల వారై సువార్త ప్రకటించడానికి వారిని పంపించాలని ఆయన పంన్రెండు మందిని నియమించెను" (మార్కు 3:13-15).

యుఇయస్ఐ ఒక వ్యక్తి కాదు, అది ఉద్యమం. దీని పరిచర్య స్వభావం ప్రకారం వ్యక్తులు అందరూ కలిసి పనిచేస్తేనే ఫలితాలు వస్తాయి.

అపోస్తులుల కార్యాలు 1:8 ప్రకారం ప్రభువు సువార్త భూదిగంతాల వరకు చేరాలని ఆశపడ్డాడు. అపోస్తలులు సమిష్టిగా కలసి, పంచుకొని చేసిన పరిచర్య భూదిగంతాల వరకు చేరింది.

దేవుడు మనకప్పగించిన బాధ్యతను నెరవేర్చే సామర్థ్యం నీకుందని నీవు నమ్మినా, నీవు నేను సహవాసంలో వేరే వారి సహాయం, సహకారం లేకుండా మన లక్ష్యాలు చేరుకోలేం. కళాశాల ప్రాంగణాల్లో ఇయు విద్యార్థుల సంఖ్య రెండింతలు, మూడింతలు కావాలంటే పరిచర్య బాధ్యతను అందరితో పంచుకోవాలి, అందరూ పంచుకోవాలి. ప్రస్తుతం మన పరిచర్యలో బాధ్యతను పంచుకొనే వాళ్ళ కంటే ప్రేక్షకుల సంఖ్య అధికంగా ఉన్నట్టుంది. ఇయు విద్యార్థులు సహితం కమిటీ చేసుకొంటుంది,చూసుకొంటుందనే వైఖరిలో ఉంటున్నారు. కొందరు వాళ్ళు పాల్గొనడం మాని వేరే వాళ్ళకి బాధ్యతలు అతిగా అప్పచెబుతారు, మరి కొందరు తామే అంతా అంటూ వన్ మ్యాన్ షో చేస్తారు.

నాయకత్వాన్ని పంచుకోవడం, నాయకత్వాన్ని ఇతరులకు అందించడం వాక్యానుసారమైన నాయకత్వం. గతంలోనూ టీం వర్క్ ద్వారా విద్యార్థులు, గ్రాడ్యుయేట్స్, స్టాఫ్ కలిసి పనిచేసి ఆనందాన్ని అనుభవించేవారు. ఈ మూడు బృందాలు మన పరిచర్యకు మూలకంభాల లాంటివారు.

## కాపరి నాయకత్వం

దేవుడు లేఖన భాగాల్లో అనేక తరుణాల్లో ఆయనను కాపరిగా అభివర్ణించుకోవడానికి ఇష్టపడ్డాడు. వాస్తవానికి యెహెజ్కేలు 34 :1-6 గ్రంథంలో ఇశ్రాయేలీయుల్లో చెడ్డ కాపరులు ప్రజలను తప్పు దోవ పట్టించారని, గద్దించాడు.

యేసు ఈ లోకంలో ఉన్నప్పుడు ప్రజలను చూసి కాపరి లేని గొర్రెలని భావించి కనికరంతో కదలి పోయేవాడు. ఆ కనికరం కడుపు లోతుల్లోంచి ఉబికి వచ్చేది. ఇలాంటి సమయాల్లో ఏదో ఒక అద్భుతాన్ని చేసి వాళ్ళ అవసరత తీర్చేవాడు. ఆయన ప్రజల దేవుడు. ఆయనకు వ్యక్తులే ముఖ్యం. వాళ్ళ కోసం ఎంత వరకైనా వెళతాడు. "గొఱ్ఱెలకు జీవము కలుగుటకును అది సమృద్ధిగా కలుగుటకును నేను వచ్చితినని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" (యోహాను 10:10).

దేవుడు మనకు అప్పగించిన విద్యార్థులు, గ్రాడ్యుయేట్స్, స్టాఫ్‌ను ప్రధాన కాపరైన యేసుక్రీస్తు వలె వాళ్ళ ఆధ్యాత్మిక, భౌతిక, మానసిక అవసరాలను తీర్చవలసిన అవసరం ఎంతో ఉంది. "బలిమిచేత కాక దేవుని చిత్తప్రకారము ఇష్టపూర్వకముగాను, దుర్లాభాపేక్షతోకాక సిద్ధమనస్సుతోను, మీ మధ్యనున్న దేవుని మందను పైవిచారణ చేయుచూ దానిని కాయుడి.మీకు అప్పగించబడిన వారిపైన ప్రభువులై నట్టుండక, మందకు మాదిరులుగా ఉండుడి" (1పేతురు 5 :2-3).

ఇటీవల కాలంలో జరిగిన రాష్ట్ర దీర్ఘకాలిక ప్రణాళికలో (యల్ఆర్‌పి-2030) సహితం మెంబర్ కేర్ అవసరతను ఉద్ఘాటించడం జరిగింది. కాపరులు లేని యుఇయస్ఐని ఊహించుకోలేం... మనకవసరమైంది కాపరి నాయకత్వమే కాని కార్పొరేట్ నాయకత్వం కాదు.

యేసుప్రభువు వారు ఈ లోకం నుంచి పరలోకానికి వెళ్ళక ముందు పేతురుతో పంచుకొన్న ఆయన హృదయస్పందన కాపరి నాయకత్వాన్ని తర్వాత తరానికి అందించమని. అదే మన హృదయ స్పందన కావాలి.

- బి.జాన్ లాజరస్, బి.మంజుల లాజరస్
యుఇయస్ఐ నేషనల్ రిటైర్డ్ స్టాఫ్,
హైదరాబాద్

ప్రత్యేకం



# సమర్థవంతమైన నాయకులను తయారుచేయాలి

ఒక సంస్థ లేక ఉద్యమం అంతరాయం లేకుండా కొనసాగాలంటే సమర్థవంతమైన నాయకత్వం ఎంతో అవసరం. యుఇయస్ఐ సంస్థగా మంచి విజన్, మిషన్ కలిగియున్నప్పటికీ ఆ ప్రకారం పనిచేయాలన్న తృష్ణ, నశించిపోతున్న విద్యార్థుల పట్ల శ్రద్ధ కలిగిన నాయకుల కొరత చాలా ఉంది. పరిచర్య కొరకు వ్యక్తిగత దర్శనము, మిషన్, దేవుని పిలుపు అవసరమన్న అవగాహన కొంతమందిలో మాత్రమే కనిపిస్తుంది. గొప్ప ఆశయాలతో, ఉన్నతమైన విలువలతో ప్రారంభించబడిన అనేక ఉద్యమాలు కాలగర్భంలో కలసిపోయినట్లు చరిత్ర మనకు చెబుతుంది. సమర్థవంతమైన నాయకుల్ని తయారు చేసే విషయంలో ఇప్పుడైనా మనం మేల్కొనకపోతే మన పరిస్థితి కూడా అంతే అవుతుంది.

❄ ❄ ❄ ❄

సమర్థవంతమైన నాయకులను తయారుచేయడం నాయకత్వపు బాధ్యతలలో ఒకటి. అలాగని తమకు అనుకూలంగా ఉన్నవారినో, సన్నిహితంగా ఉన్నవారినో, ఇష్టమైనవారినో నాయకులను చేయడం దేవునికిష్టమైన పని కాదు. మోషే, ఎలీషా, పౌలువంటి భక్తులు చూపిన మాదిరిని అనుసరిస్తూ సమర్థవంతమైన నాయకులను ఎలా తయారుచేయాలో ఈ వ్యాసంలో తెలుసుకొందాం.

### నాయకుడు

ఒక లక్ష్య సాధన కోసం పనిచేస్తున్న ఒక సమూహాన్ని ప్రభావితం చేసేవాడే నాయకుడు. అనగా ప్రజలను కార్యోన్ముఖులుగా చేసేవాడు, శిష్యులను నాయకులుగా, నాయకులను మార్పు సాధకులుగా చేసేవాడు.

### నాయకత్వము

దర్శనాన్ని కలిగి, ఆ దర్శనాన్ని ఇతరులతో పంచుకొని, ఆ దర్శనాన్ని నెరవేర్చడానికి వారు సహకరించేటట్లుగా, వారు తమ స్వంత దర్శనాన్ని సంపాదించుకొనేటట్లుగా వారిని ఉత్తేజపరచడమే నాయకత్వము. – మిండి గిబ్బిన్స్

వ్యక్తులను తమ వ్యక్తిగతమైన, వృత్తిపరమైన శక్తి సామర్థ్యాలను పూర్తిగా గుర్తించగలిగేటట్లు, సమయాన్ని, శక్తిని, భావోద్రేకాలను వెచ్చించడంతోపాటు, వారికి తర్ఫీదును, శిక్షణను అందిస్తూ ఇతరులను సంసిద్ధులను చేయగలిగే కళనే నాయకత్వము అంటారు. – డఫ్ని మలోరి

నాయకుడంటే అధికారి కాదు, ఇతరులపై పెత్తనం చేసేవాడు కాదు.

మార్గం తెలిసినవాడు, మార్గం చూసేవాడు, ఆ మార్గములో వెళ్ళేవాడే **సమర్థవంతమైన నాయకుడు** (యోహాను 14:6).

ఒక లక్ష్య సాధన కోసం పరిశుద్ధాత్ముని నడిపింపుతో ఒక శక్తివంతమైన సంబంధాన్ని కలిగి కలిసికట్టుగా ముందుకు సాగడమే క్రైస్తవ నాయకత్వము. ఈ నాయకత్వము ఇతరులకు సేవ చేస్తూ వారిని నడిపిస్తుంది, నడిపిస్తూ వారికి సేవ చేస్తుంది.

## నాయకత్వ పిలుపు

"ఒక ఆత్మీయ నాయకునికి ఉండవలసిన మొట్టమొదటి లక్షణం దేవుని పిలుపు. అప్పుడు అతడు తన పనిని ఒక పనిగా భావించక, దేవుని పిలుపుగా భావిస్తాడు" అని అంటాడు జాక్ పూనన్.

క్రైస్తవ నాయకత్వము నిత్యజీవము కోసము, నాయకత్వము కోసము దేవుడిచ్చిన పిలుపు (మత్తయి 4:18-20).

"దేవుడు ఒక గొప్ప కార్యాన్ని తలపెట్టాలని భావించినప్పుడెల్లా, తన కోసం అబ్రహాము, మోషే, గిద్యోను, ఎస్తేరు, జక్కయ్య, పేతురు, పౌలు మొదలగువారిని దేవుడు పిలిచాడు. వారు ప్రజలను ప్రభావితం చేయాలన్నదే దేవుని పిలుపులోని ఉద్దేశం.

## నాయకునికి ఉండాల్సిన లక్షణాలు

బానిసగా పరాయి దేశంలో ఉంటూ, సిరియా రాజు దృష్టిలో ఘనుడును, మహా పరాక్రమశాలియునైన తన యజమానినే ప్రభావితం చేసిన (2 రాజు 5:1-25) చిన్నదాని నుంచి సమర్థుడైన నాయకునికుండాల్సిన లక్షణాలను (1-3 వచనాలు) చూద్దాం.

**దర్శనము:** తన యజమాని కుష్టు వ్యాధినుండి స్వస్థపడడం

**మిషన్:** నయమాను స్వస్థతకొరకు ప్రవక్తయైన ఎలీషాయొద్దకు వెళ్ళడం



**తృష్ణ:** నేనెంతో కోరుచున్నాను (3వ)

**జాలి గుణము:** తన యజమానుని పట్ల ఆమెకున్న శ్రద్ధ, జాలి

ఈ విధంగా ఆమె తన యజమానురాలిద్వారా తన యజమానుని ప్రభావితం చేసింది. దాని ఫలితంగా

- సిరియా రాజు సైన్యాధిపతియైన నయమాను కుష్ఠురోగము నయమై పోయింది
- యెహోవాయే నిజమైన దేవుడని నమ్మకం కుదిరింది
- యెహోవా దేవుని మాత్రమే ఆరాధించాలని ఒప్పందం చేసుకొన్నాడు

చెరపట్టబడి, పరాయి దేశంలో పరిచారకురాలిగా ఉన్న ఒక చిన్నది, బలవంతుడు, గొప్పవాడైన తన యజమానుని ప్రభావితం చేయగలిగితే విద్యార్థి పరిచర్యలో ఉన్నామని చెప్పుకొంటున్న మనం అటువంటి నాయకులను తయారు చేయలేకపోవడం శోచనీయం.

## పరిచర్య పట్ల భారం కలిగిన నాయకుల కొరతకు కారణాలు

- తమ తర్వాత నాయకత్వ బాధ్యతలు స్వీకరించి సమర్థవంతంగా పనిచేయగలిగే నాయకులను తయారు చేయకపోవడం.
- తరాల అంతరం వలన కొంతమంది పరిస్థితులకు అనుగుణంగా మారలేక ఉదాసీనంగా ఉండిపోవడం.
- పితరులు మనకిచ్చిన వారసత్వాన్ని మన తర్వాత తరానికి అందించలేక పోవడం.
- నాయకత్వ లక్షణాలు నిగూఢంగా ఉన్న వారిని గుర్తించకపోవడం. గుర్తించినా తగిన తర్ఫీదునివ్వకపోవడం.
- నాయకులు తయారు చేయబడతారు అనే సత్యాన్ని గ్రహించకపోవడం.
- నాయకత్వంలో ఉన్న చిన్నవారిని ప్రోత్సహించక పోవడం, కొంతమంది వారిని విమర్శించడం మొదలైనవి.

## సమర్థులైన నాయకులను ఎవరు తయారు చేయాలి?

"సమర్థుడైన ఒక వ్యక్తి వెనుక అనేక మంది సమర్థులైన వ్యక్తులుంటారు." - చైనా సూక్తి

కాబట్టి నాయకులను తయారు చేయడం ఏ ఒక్కరి పనో కాదు. విద్యార్థి పరిచర్యలో పాలుపొందుతున్న ప్రతి ఒక్కరు ప్రభావవంతమైన నాయకులుగా ఉంటూ సమర్థులైన నాయకులను తయారుచేస్తే కళాశాల ప్రాంగణాలలోను, సమాజంలోను మన ప్రభావాన్ని చూపగలము. నాయకులను తయారుచేసేవారు మాదిరికరంగా ఉంటూ తమ జీవితాలద్వారా ఇతరులను ప్రేరేపించి వారిని నాయకులుగా చేయాలి.

## సమర్థులైన నాయకులను తయారుచేయడం ఎలా?

నాయకులను తయారుచేసే వారికి విద్యార్థి పరిచర్యపట్ల సరియైన దృక్పథం, సేవకొరకైన దర్శనము, పిలుపుతో పాటు, నాయకత్వం గురించి స్పష్టమైన అవగాహన ఉండాలి.

మొదటిగా తమకు అందుబాటులో ఉన్న కొందరు విద్యార్థులు, గ్రాడ్యుయేట్స్‌ను ప్రార్థన పూర్వకంగా ఎంచుకొని (లూకా 6:12-13), వారు దేవుని సంబంధమైన విషయజ్ఞానములో ఎదుగుచూ, అన్ని విషయాలలో దేవుని చిత్తాన్ని గ్రహించేటట్లు వారికొరకు ప్రార్థిస్తూ ఉండాలి (ఎఫె 1:19; కొల 1:9-10).

రెండవదిగా నాయకునికి ఉండాల్సిన లక్షణాలు, విలువలు, వైఖరి, యేసు క్రీస్తు నాయకత్వపు శైలి, బృంద పరిచర్య, సమస్యలను పరిష్కరించుకోవడం మొదలైన వాటిని అధికారికంగా, అనధికారికంగా బోధించాలి (ఫిలి 4:9). వారిని మన గృహాలకు ఆహ్వానించడం, బైబిల్ స్టడీస్‌కు, సమావేశాలకు మనతో తీసుకువెళ్ళడం ద్వారా వారు మన జీవితాలను దగ్గరగా గమనిస్తూ అనేక విషయాలు నేర్చుకొంటారు. మోషే, ఎలీషా, పౌలు ఆ విధంగానే నాయకులను తయారు చేశారు.

మూడవదిగా వారిలో నిగూఢంగా ఉన్న కృపావరాలు, తలాంతులు, నైపుణ్యాలను గుర్తించి వాటిని అభివృద్ధి చేసుకొనే అవకాశాలు కల్పించాలి. కొన్ని బాధ్యతలను అప్పగించడం, ఆయా సామర్థ్యాలను పెంపొందించే శిక్షణా శిబిరాలకు పంపించడం, సాహిత్యం చదివించడం ద్వారా, కొన్ని మాదిరులను చూపించటం ద్వారా దీనిని సాధించవచ్చు. ఈ క్రమంలో మన సమయాన్ని, ధనాన్ని త్యాగం చేయాల్సి ఉంటుంది.

## సమర్థులైన నాయకులలో పెంపొందించాల్సిన లక్షణాలు:

**దేవుని పిలుపు:** ఒక వ్యక్తి ఏమి చేయాలని దేవుడు ఆశిస్తాడో దానినే దేవుని చిత్తమంటాం. నాయకుడు ప్రతి విషయంలో దేవునిమీద ఆధారపడుతూ ప్రభువా నేనేమి చేయాలి అని దేవుని అడిగి తెలుసుకోవాలి (ఉదా॥ సమూయేలు, పౌలు). 2 పేతు 1:10లో మీ పిలుపును, ఏర్పాటును నిశ్చయము చేసుకొనుటకు వేగిరపడుడని పేతురు విశ్వాసులను హెచ్చరిస్తున్నాడు.

**నిశ్చయత:** దేవుని పిలుపునుబట్టి అప్పగించబడిన బాధ్యత దేవునినుండి వచ్చినదని గట్టిగా నమ్మాలి. తను చేస్తున్న పనిలో నమ్మకమున్నప్పుడు ఎలాంటి సంశయం లేకుండా ధైర్యంగా నిర్ణయాలుచేయగలుగుతారు.

**నిబద్ధత:** తను నమ్మినదానికి కట్టుబడియుండి తన సమయము, శక్తి, తలాంతులు, వనరులను దానికొరకే వెచ్చించడం.

**యోగ్యత:** నాయకునికి తను చేసే పని గురించి సంపూర్ణమైన అవగాహన, అవసరమైన నైపుణ్యాలు కలిగియుండాలి (కీర్త 78:72). మనకు యోగ్యతను, తలాంతులను ఇచ్చేది దేవుడే అయినప్పటికీ వాటిని అభివృద్ధి చేసుకోవలసిన బాధ్యత మనదే.

**విశ్వాసము/నమ్మకము:** దేవుడు ఒక వ్యక్తిని నమ్మి కొంతపని అప్పగించినప్పుడు ఆ పని చేయడానికి అవసరమైనవన్నీ ఆయన ఇస్తారనే నమ్మకముండాలి. అదే మనకు ఆత్మ విశ్వాసాన్నిస్తుంది (ఫిలి 4:13).

**శీలము:** క్రైస్తవ శీలమనగా ముఖ్యంగా యధార్థత, నమ్మకము అనగా మాటకు కట్టుబడి ఉండడం లేదా మాటలు, చేతలు ఒకేలా ఉండడం. అటువంటి నాయకుని ఎవరైనా ఇష్టపూర్వకంగా వెంబడిస్తారు (కీర్త 78:72).

## ముగింపు

మార్పుచెందిన విద్యార్థులు, గ్రాడ్యుయేట్స్ అందరూ సమర్థవంతమైన నాయకులుగా తయారైతే వారు తమ ప్రాంగణాలను, సమాజాన్ని ప్రభావితం చేస్తూ ప్రభువుకు మహిమ తీసుకొస్తారు. ఆ విధంగా మారడానికి యేసు క్రీస్తు ప్రభువు మనకు సహాయము చేయునుగాక!

– **వి. గౌరీ కుమారి,** తెనాలి




# ప్రేషిత సేవలో పాల్గొందాం

1992వ సంవత్సరం, మే నెల, ఎర్రటి ఎండలు, యల్‌టి క్యాంప్ కడపలో జరుగుతోంది. ఒక విద్యార్థి అనంతపురం జిల్లా నుంచి వచ్చాడు. ఆ క్యాంప్‌లో అతనే అందరికంటే చిన్న వయసు వాడు. ఆ క్యాంప్‌లో ఒక మధ్యాహ్న వేళ, ఉజ్జయినీకి మిషనరీ విద్యార్థిగా వెళ్ళిన తాళ్ళూరి ప్రసాద్‌గారు తన సాక్ష్యాన్ని, తన అనుభవాలను పంచుకొన్నాడు. తన సాక్ష్యం ఆనేకమంది విద్యార్థులను ప్రభావితం చేసింది. వారిలో ఈ చిన్న వయసు విద్యార్థి కూడా ఉన్నాడు. వసంతాలు వడివడిగా వెళ్ళిపోయాయి. అప్పటి విద్యార్థి నేడు మిషనరీగా అరకులో, ఒక మిషన్ సంస్థ తరపున దేవుని సేవ చేస్తూ అనేకమందికి ఆశీర్వాదకరంగా ఉన్నాడు. మన స్టేట్ మిషన్స్ ట్రెనింగ్ క్యాంప్స్‌లో, ఫీల్డ్ విజిట్స్‌లో, మిషనరీ జీవితాలను పరిచయం చేసేపనిలో సహాయం చేస్తున్నాడు.

1999వ సంవత్సరం, నల్గొండలో ఒక ఇవాంజిలిస్టిక్ క్యాంప్ చాలా బాగా జరుగుతోంది. ఆ క్యాంప్‌కు హైందవ కుటుంబానికి చెందిన ఒక విద్యార్థి వచ్చి క్రీస్తును అంగీకరించాడు. శిష్యునిగా, నాయకునిగా ఎదిగాడు. 2000సం॥లో హైదరాబాద్‌లో జరిగిన స్పైకాన్‌లో మిషన్స్ సెమినార్‌కు హాజరయ్యాడు. అక్కడ దేవుడు అతనితో మాట్లాడాడు. దేవుని మాటకు లోబడి ఆగ్రాకు మిషనరీ స్టూడెంట్‌గా వెళ్ళాడు. తరువాత పూర్తికాలపు సేవ పిలుపు అందుకొని కాశ్మీరులో విద్యార్థుల పరిచర్యలో స్టాఫ్‌గా చేరాడు. ఇప్పుడు, మధ్యప్రదేశ్‌లో స్టేట్ సెక్రటరీగా పని చేస్తూ, అనేకమంది విద్యార్థులకు, గ్రాడ్యుయేట్స్‌కు, స్టాఫ్‌కు ఆశీర్వాదకరంగా జీవిస్తున్నాడు.

క్రైస్తవులైన తన స్నేహితులను అల్లరి చేస్తూ, మద్యపానానికి బానిసై కన్న తల్లిని సైతం కొట్టడానికి వెనుకాడని ఒక విద్యార్థి దేవుని కృపచేత ఒక గాస్పల్ ఈవినింగ్‌లో రక్షణపొంది, శిష్యునిగా తర్ఫీదుపొంది, నాయకునిగా ఎదిగాడు. ఆ తరువాత తన జీవితం పట్ల దేవునికున్న ప్రణాళికను తెలుసుకోవడానికి 2012వసం॥లో రంపచోడవరంలో జరుగుతున్న స్టేట్ మిషన్స్ ట్రైనింగ్ క్యాంప్‌కి వెళ్ళాడు. అక్కడ దేవుడు అతనితో స్పష్టంగా మాట్లాడాడు. 2015 సం॥లో తన జీవితాన్ని దేవుని సేవకు సమర్పించుకొన్నాడు. కాలం వేగంగా గడిచిపోయింది. ఆ విద్యార్థి మిషనరీగా 2016 సం॥లో మాల్టోలు అనబడే జన జాతుల మధ్య జార్ఖండ్‌లో పనిచేశాడు. 2018 వసం॥లో బీహార్ రాష్ట్రంలో ముసాఫర్ అనే జనజాతుల మధ్య పయనీరింగ్ మిషనరీగా వెళ్ళి ప్రస్తుతం అక్కడే ఒక మిషన్స్ సంస్థ తరపున దేవుని సేవ చేస్తున్నాడు.

ప్రతి సంవత్సరం వందలాది విశ్వాసులు తమ జీవితంలో దేవుని చిత్తాన్ని తెలుసుకొని, ఆ చిత్తానికి లోబడి తమ జీవితాలను ప్రేషిత సేవకు సమర్పించుకుంటున్నారు. దానికి కారణం మన పితరుల దర్శనం. యుఇయస్ఐ ఆవిర్భావ సమయంలో

(1954సం॥) మనకు 3 లక్ష్యాలు మాత్రమే ఉన్నాయి. ప్రేషిత సేవ అనే 4వ లక్ష్యాన్ని 1964 వసం॥లో చేర్చారు. అప్పట్లో ఉన్న నేషనల్ ఎగ్జిక్యూటివ్ బాడీ ఈ నిర్ణయం తీసుకోవడానికి, కోయంబత్తూరులో విద్యార్థుల పరిచర్య స్థాపించడానికి కీలక పాత్ర పోషించిన డేవిడ్ సి వాట్సన్, వెల్లూరులో విద్యార్థుల పరిచర్య స్థాపించడానికి కీలక పాత్ర పోషించిన డా. జాన్ మూడి, మద్రాసులో విద్యార్థుల పరిచర్య స్థాపించడానికి కీలక పాత్ర పోషించిన డా. టి. యన్. స్టెరెట్, లోయిస్ స్టెరెట్‌ల ప్రభావం ఉండవచ్చని బ్ర. ఏ.జి. అగస్టీన్ గారు అన్నారు. అగస్టీన్ గారు విద్యార్థిగా ఉన్నప్పుడు సిస్టర్ లోయిస్ స్టెరెట్ గారు దేవుని హృదయం, ప్రపంచ మానవాళి పట్ల దేవునికున్న దర్శనం గురించి తరచూ వారికి బోధించేవారట.

మొదటి శతాబ్దంలో దేవుని ప్రేషిత ఆదేశానికి లోబడి తోమా భారత దేశానికి సువార్త ప్రకటించడానికి వచ్చాడు. ఇది చారిత్రక సత్యం. ఇటీవల మన ప్రధానమంత్రి ఇశ్రాయేల్ దేశ పర్యటనకు వెళ్ళినప్పుడు తోమా జ్ఞాపికను ఆ దేశ ప్రధానమంత్రి నెతన్యాహుకు బహూకరించాడు.

పంతొమ్మిదవ శతాబ్దంలో దేవుని ప్రేషిత ఆదేశానికి లోబడి మెడికల్ డాక్టరైన డేవిడ్ లివింగ్‌స్టన్ ఆఫ్రికాకు మిషనరీగా వెళ్ళాడు. ఇరవైయవ శతాబ్దంలో దేవుని ప్రేషిత ఆదేశానికి లోబడి జిమ్ ఇలియట్ ఇక్వేడారుకు మిషనరీగా వెళ్ళాడు.

ఇరవై ఒకటవ శతాబ్దంలో అలాంటి వారిని విశ్వవ్యాప్త సువార్త సేవకు అందిచాలన్న ఆశయంతో, మన స్టూడెంట్స్, గ్రాడ్యుయేట్స్ దేవుని యొక్క విశ్వదర్శనం కలిగి ఉండాలన్న ఆలోచనతో మన పితరులు 4వ లక్ష్యం "ప్రేషిత సేవ"ను మనకు ఇచ్చారు. కాబట్టి ఈ సందర్భంలో 4వ లక్ష్యం అవగాహన చేసుకోవడం మన అందరి బాధ్యత. ముందుగా 4వ లక్ష్యం స్టేట్‌మెంట్‌ను చూద్దాం.

"దేవుని ప్రేషిత ఆజ్ఞ విషయమై స్టూడెంట్స్, తమ జీవితంలో దేవుని చిత్తాన్ని కనుగొని ఆయన చిత్తానికి లోబడి తామున్నచోట గాని ప్రపంచంలో మరెక్కడైనా గాని విశ్వవ్యాప్తంగా సువార్తను అందించడానికి వారికి సహాయం చేయుట."

## 4 వ లక్ష్యం, "ప్రేషిత సేవ" స్టేట్‌మెంట్‌లోని 5 భాగాలను చూద్దాం

1. **సూత్రం:** విశ్వవ్యాప్తమైన దేవుని ప్రేషిత ఆజ్ఞ
2. **పాత్రలు:** స్టూడెంట్స్, గ్రాడ్యుయేట్స్
3. **పని తీరు:** విద్యార్థులు దేవుని చిత్తాన్ని తెలుసుకొని లోబడడానికి సహాయం చేయటం
4. **స్థలం:** ఉన్న ఊరు, పొరుగు రాష్ట్రం, ఉత్తర భారత దేశం, ఇతర దేశాలు
5. **ఉద్దేశం:** ప్రపంచ సౌవార్తీకరణ

## 1. సూత్రం: విశ్వవ్యాప్తమైన దేవుని ప్రేషిత ఆజ్ఞ

దేవుని ప్రేషిత ఆజ్ఞ అంటే ఏంటో తెలుసుకొందాం. తండ్రి వద్దకు ఆరోహణమవ్వడానికి ముందు ప్రభువైన యేసు తన శిష్యులందరికి ఒక కొత్త ఆజ్ఞను ఇచ్చాడు. దీనిని మత్తయి 28:19లో, అపో. కా. 1:8లో పరిశుద్ధాత్మ దేవుడు చాలా స్పష్టంగా రాయించాడు. మీరు వెళ్ళి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి (మత్తయి 28:19). ఇదే ప్రేషిత ఆజ్ఞ. నీవు శిష్యుడవైతే/శిష్యురాలవైతే ఈ ఆజ్ఞ నీకు కూడా వర్తిస్తుంది.

ఈ ఆజ్ఞ ప్రతి విద్యార్థి, గ్రాడ్యుయేట్ హృదయంలో దూసుకుపోవాలని, ప్రతి వ్యక్తికీ అది వ్యక్తిగతంగా దేవుని ఆదేశం అవ్వాలని మన పితరులు ఆశించారు. సువార్త పరిచర్య తమిళనాడులోని విద్యార్థులకు మాత్రమే కాకుండా మధ్య, ఉత్తర భారతదేశం అంతటా జరగాలని, అలాగే విద్యార్థులకు మాత్రమే కాకుండా, ప్రేషిత ఆదేశం అనుగుణంగా సమస్త జనులకు సువార్త ప్రకటించే ప్రక్రియలో మన విద్యార్థులు, గ్రాడ్యుయేట్స్ పాత్ర కూడా ఉండాలని తలంచారు.

ఇక్కడ మనం మన మొదటి లక్ష్యం ఇవాంజిలిజంకు నాల్గవ లక్ష్యం మిషన్స్‌కు గల తేడాలను తెలుసుకోవాలి.

## మొదటి, నాల్గవ లక్ష్యాల మధ్య వ్యత్యాసం

### సువార్తీకరణ

- స్వంత భాష, ప్రదేశం, స్థానిక సంఘం
- స్థానిక సంఘ సభ్యుల సంఖ్య పెరుగుతుంది
- ఆధ్యాత్మిక అవసరాలు మాత్రమే తీర్చబడతాయి
- విద్యార్థుల మధ్య పరిచర్యకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది
- ఔట్‌రీచ్ చేస్తాం

### ప్రేషిత సేవ

- మనది కాని భాష, ప్రదేశం

* నూతన సంఘాలు స్థాపించబడతాయి
* ఆధ్యాత్మిక అవసరాలతోపాటు సాంఘిక అవసరాలు తీర్చబడతాయి
* ప్రపంచ వ్యాప్త పరిచర్యకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది
* రీచ్‌ఔట్ చేస్తాం

ఈ వ్యత్యాసం తెలిసికోకుండా కొందరు ప్రేషిత సేవ చేయాలన్న పిలుపు అందుకొన్న విద్యార్థులను, యవ్వన గ్రాడ్యుయేట్స్‌ను నిరాశపరుస్తున్నారు. ముఖ్యంగా "సువార్త చెప్పడానికి ఇక్కడ చాలా మంది స్టూడెంట్స్ లేదా కాలేజ్‌లు ఉన్నాయి. మీ తల్లిదండ్రులు మీకు ఎంతో డబ్బు ఖర్చుపెట్టి చదివించారు, నీవు ఒక్కడివే కొడుకువి/కూతురివి వాళ్ళను వదిలేసి ఎక్కడికి వెళ్తావు" లాంటి మాటలతో వారు దేవుని చిత్తానికి లోబడకుండా అడ్డుపడుతుంటారు. ఇశ్రాయేలు దేశంలో అనేకమందికి సువార్త ప్రకటించకుండా తోమా మన దేశం ఎందుకు వచ్చాడో అర్థం చేసుకోవాలి. ప్రేషిత ఆజ్ఞకు విధేయత చూపి తోమా భారతదేశం వచ్చాడని తెలిసికోవాలి.

## 2. పాత్రలు: స్టూడెంట్స్, గ్రాడ్యుయేట్స్

స్టూడెంట్స్, గ్రాడ్యుయేట్స్ ఇద్దరూ దేవుని ప్రేషిత ఆజ్ఞను గైకొని ప్రపంచ సువార్తీకరణకు ఒక దర్శనం కలిగి ఉండడానికి సిద్ధంగా ఉండాలి. ప్రతి వ్యక్తి కూడా ప్రేషిత సేవలో తన వంతు బాధ్యతను తీసుకోవాలని దేవుడు సవాలు చేస్తున్నాడు.

## 3. పని తీరు: విద్యార్థులు దేవుని చిత్తాన్ని తెలుసుకొని లోబడటానికి సహాయం చేయడం

స్టూడెంట్స్, గ్రాడ్యుయేట్స్ తమ జీవితాల్లో దేవుని చిత్తం ఏంటో తెలుసుకోవడానికి సహాయం చేసి, వారు ఆ చిత్తానికి లోబడే విధంగా ప్రోత్సహించమని ఈ లక్ష్యం చెబుతుంది. కాబట్టి విద్యార్థులు, గ్రాడ్యుయేట్స్ తమ జీవితం పట్ల దేవుని చిత్తాన్ని తెలుసుకోవాలి.

## 4. స్థలం: ఉన్న ఊరు, పొరుగు రాష్ట్రం, ఉత్తర భారత దేశం, ఇతర దేశాలు

"అయినను పరిశుద్ధాత్మ మీ మీదికి వచ్చునప్పుడు మీరు శక్తినొందెదరు గనుక మీరు యెరూషలేములోను, యూదయ సమరయ దేశములయందంతటను భూదిగంతములవరకును, నాకు సాక్షులైయుందురని వారితో చెప్పెను." అపో.కా. 1:8

స్టూడెంట్స్, గ్రాడ్యుయేట్స్‌గా మన మొదటి బాధ్యత పనిచేస్తున్న స్థలంలో ప్రభువుకు సాక్షులుగా ఉంటూ విద్యార్థులకు అందుబాటులో ఉండడం. మనందరి ప్రస్తుత సేవా పొలం స్థానిక విద్యార్థి లోకమే. అయితే ప్రేషిత ఆదేశం ప్రకారం మన స్వంత ప్రదేశంలోనే ఆగిపోకూడదు, అంటే యెరూషలేము తరువాత, యూదయ, తరువాత సమరయ, ఆ తరువాత భూదిగంతములవరకు సాక్షులుగా ఉండాలి.

## 5. ఉద్దేశం: ప్రపంచ సువార్తీకరణ

దేవుడు అబ్రహాముతో ఇలా నిబంధన చేశాడు. అందులో రెండు భాగాలున్నాయి.

1. నిన్ను ఆశీర్వదించెదను (ఆది 12:2)

2. భూమియొక్క సమస్త వంశములు నీయందు ఆశీర్వదించబడును.(ఆది 12:3)

ఈ నిబంధనను మత్తయి 28:18,19 లోని ప్రేషిత ఆదేశంతో పోల్చి చూద్దాం. అబ్రహాము స్థానంలో మనల్ని పెట్టుకొందాం.

దేవుడు మనలను ఆశీర్వదించాడు (రక్షణ ఇచ్చాడు). ఇది మొదటి భాగం.

మీరు వెళ్ళి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి అంటే భూమియొక్క సమస్త వంశములు మనద్వారా ఆశీర్వదించబడాలి (రక్షణపొందాలి). ఇది రెండవ భాగం.

సమస్త జనులను శిష్యులుగా చేయాలి. ఇది శాసనం. ఇందులో వేరే గూడార్థం కానీ రహస్యం కానీ లేవు. ఇందులో ఎలాంటి రాయితీలు కూడా లేవు. ప్రతి మనుష్యుని శిష్యునిగా చేయమని ఆజ్ఞ. అంటే ప్రతివ్యక్తి దగ్గరికి సువార్త వెళ్ళాలి, ఆ వ్యక్తి శిష్యుడవ్వాలి. ఇలా ప్రతివ్యక్తి, ప్రతి జాతికి సువార్త అందాలంటే, మనం భూదిగంతాలకు వెళ్ళాలి.

భూదిగంతాలకు వెళ్ళాలంటే పిలుపు ఉండాలి. అయితే దేవుడు అందరిని పూర్తికాల సేవకు పిలువడు. కొందరికి మాత్రమే ఆ భాగ్యాన్ని ఇస్తాడు. అయితే అందరూ ప్రేషిత సేవలో పాల్గొనాలని దేవుని ఉద్దేశం. మన పితరుల ఆశయం కాబట్టి స్టూడెంట్స్, గ్రాడ్యుయేట్స్ ప్రేషిత సేవలో పాల్గొనడానికి గల అవకాశాలేంటో చూద్దాం.

ఎ. మిషన్స్‌కు సంబంధించిన సమాచారాన్ని సేకరించడం.

బి. సువార్త ప్రకటింపబడని ప్రదేశాల కోసం

ప్రార్థించడం. ఉదా! ఉత్తర భారతదేశం, 10/40 విండోలో ఉన్న దేశాలు, ముస్లిమ్స్, హిందువులు,...

సి. మిషన్స్ పట్ల ఆసక్తి ఉన్న గుంపును ఏర్పరచడం (యంఐజి).

డి. మిషనరీ కుటుంబాలతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరపడం, వారిని దర్శించడం.

ఇ. మిషనరీ జీవిత కథలను చదవడం.

యఫ్. మిషన్స్ పత్రికలను సేకరించడం, లేదా చందాదారులవ్వడం.

జి. మిషనరీ సంస్థలకు ఆర్థిక చేయూతనివ్వడం.

హెచ్. ఇయు మిషన్స్ రిట్రీట్‌కు లేదా మిషన్స్ ప్రార్థనా సమావేశానికి హాజరవ్వడం.

ఐ. మిషన్ ఎక్స్‌పోజర్ ట్రిప్‌కు వెళ్ళడం (యంఇటి).

జే. స్టేట్ మిషనరీ ట్రైనింగ్ క్యాంప్స్‌కు హాజరవ్వడం (యస్‌యంటిసి) కి హాజరవ్వడం.

కె. టెంట్‌మేకర్‌గా లేదా వొకేషనల్ మిషనరీగా వెళ్ళడం.

**ముగింపు**

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా జరుగుచున్న సంఘటనలు, పరిణామాలు యేసుక్రీస్తు రెండవ రాకడ అతి దగ్గరలో ఉందని సంకేతాలు ఇస్తున్నాయి. అది ఎంత దగ్గరపడితే అంత వేగంగా భూదిగంతాలకు సువార్త వెళ్ళాలి. కాబట్టి దేవుని ప్రేషిత ఆజ్ఞకు లోబడే వాళ్ళు కావాలి. ప్రేషిత సేవలో పాల్గొనే అవకాశం దేవుడు నీకిస్తే దాన్ని ఈ లోక సుఖభోగాలకోసం జారవిడవవద్దు. “మోషే పెద్దవాడైనప్పుడు విశ్వాసమునుబట్టి ఐగుప్తు ధనముకంటె క్రీస్తువిషయమైన నింద గొప్ప భాగ్యమని యెంచుకొన్నాడు (హెబ్రీ 11:24)”.

“దేవుడు నిన్ను మిషనరీగా పిలిస్తే, రాజుగా ఉండడానికి దిగజారవద్దు” అంటాడు జోర్డాన్ గ్రూమ్స్ అనే దైవజనుడు. నీ పిలుపుకు తగినట్లుగా జీవించమంటాడు పౌలు. దేవుడు రాబోవు దినాలలో మనలను తన ప్రేషిత సేవలో బలంగా వాడుకొనును గాక ఆమెన్!

**– డా. వైవిఆర్ ప్రసన్న కుమార్,** సూర్యాపేట

## విలువ తెలిసింది

కథ



లోకేష్ పెరిగిన వాతావరణం ఒక ప్రశ్నగా మారింది. అనుకోకుండా ఒక ప్రదేశానికి వెళ్ళాడు. అక్కడ ఒక చిన్న పిల్లాడు లోకేష్‌ను చూసి భయపడి పోతూ వెటకరిస్తున్నాడు. ఎందుకంటే లోకేష్‌కి మెల్లకన్ను. అందువల్ల లోకేష్ ఇంట్లోనుంచి బయటికి వెళ్లాలంటేనే ఏదో తెలియని భయము, సిగ్గు. అందువల్ల ఎప్పుడూ ఇంట్లోనే ఉంటూ ఒంటరితనాన్ని అనుభవిస్తూ ఉండేవాడు.

లోకేష్‌కి ఉన్నది చిన్నలోపమే అయినా సమాజం తన గురించి ఏమనుకుంటుందో అని భయపడేవాడు. కాలం గడుస్తూ ఉండగా లోకేష్ పాలిటెక్నిక్ చదవడానికి హాస్టల్లో జాయిన్ అయ్యాడు. తోటి వారు, సీనియర్స్ అందరూ లోకేష్‌ని చూసి నవ్వుకొంటూ నిక్ నేమ్‌తో పిలుస్తూ ఉండేవారు. చాలాసార్లు లోకేష్ తనకున్న మెల్లకన్నును బట్టి బాధపడుతూ ఉండేవాడు. తనను చూసి అందరూ నవ్వుతున్నారని, తనని నిక్ నేమ్‌తో పిలుస్తున్నారని, ఈ బాధ, భయం నుంచి తనకెవరు సహాయం చేస్తారని ఎదురు చూస్తూ ఉండేవాడు.

ఒకరోజు తన స్నేహితుని ద్వారా యేసు క్రీస్తు ప్రేమ గురించి, ఆయన మనుష్యుల్లా పైరూపాన్ని చూసేవాడు కాదని, అంతరంగాన్ని చూస్తాడని, ఆయనకు పక్షపాతం లేదని తెలిసింది. ఈ ఆదరణ కలిగించే మాటలు అతని లోపాన్ని మరిచేలా చేసి క్రీస్తు దగ్గరికి చేరేలా సహాయం చేసింది. బైబిల్ స్టడీ, క్యాంప్‌లకు వెళ్ళడం వలన తన ఒంటరితనం పోయి హృదయంలో నెమ్మది శాంతి పొందుకొని పరిచర్యలో యాక్టివ్‌గా ఇన్వాల్వ్ అవుతూ ఉండేవాడు.


కాలం గడుస్తూ ఉండగా దేవుడు కంటి ఆపరేషన్ ద్వారా తన మెల్ల కన్ను సరి చేసి తన లోపాన్నీ, భయాన్ని తీసి వేశాడు. లోకేష్ లోపం దేవునికి చేరువ చేసింది. దేవుడు లోకేష్ పై రూపం చూసి ప్రేమించలేదు తన హృదయాన్ని చూసి ప్రేమించాడు అని తెలుసుకొన్నాడు. అందుకే బైబిల్‌లో మనుష్యులు పైరూపమును లక్ష్యపెట్టుదురు గాని యెహోవా హృదయమును లక్ష్యపెట్టును (1 సమూయేలు 16:7) అని చూస్తాం.

ఎలాంటి అంగ వైకల్యం అయినా దేవుడు పై రూపాన్ని లక్ష్య పెట్టడు. నీ హృదయాన్ని చూస్తాడు కాబట్టి అవయవలోపాలను బట్టి కృంగిపోకూడదు. దేవుని దృష్టిలో నీవు విలువైన వాడివి, విలువైన దానివి. ఇప్పుడు లోకేష్‌కి జీవితం విలువ తెలిసింది.

**– తాళ్ళూరి రవికిశోర్,** దెందులూరు

(యుఇయస్ఐ-ఏపి నిర్వహించిన రైటర్స్‌వర్క్‌షాప్ స్ఫూర్తితో)

# ప్రభువు ఎక్కడ ఆజ్ఞాపిస్తే అక్కడ పని చేయడమే




### గత సంచిక తర్వాత

### 1881 సంవత్సరంలో జరిగిన పరిచర్య

1881 జనవరి 5 వ తేదీన పోర్ట్‌మోర్స్‌బిలో క్రొత్త సంఘము ఏర్పడింది. మూడు నెలల తర్వాత అంటే మార్చ్ 6వ తేదీన న్యూ గినియా నుంచి క్రైస్తవ్యంలోనికి మారిన ఇద్దరు మహిళలకు బాప్తీస్మం ఇచ్చారు. ఈ ఇద్దరూ కూడా 1901వ సం॥లో జేమ్స్ చాల్మర్స్ చనిపోయే వరకు కూడా దేవునిలో స్థిరంగా ఉన్నారు. అయితే మోటు-మోటు, లీసీ అనే స్థానిక అటవీకులు పోర్ట్‌మోర్స్‌బికి వచ్చి తనని చంపడానికి సిద్ధపడుతున్నారనే వార్త జేమ్స్ చాల్మర్స్ చెవినపడింది. ఈ వార్త విన్నప్పుడు వారి దగ్గరికే వెళ్ళి ఈ విషయాన్ని తేల్చుకోవాలని జేమ్స్ చాల్మర్స్, తనతోటివాళ్ళు సిద్ధపడ్డారు. మేము అక్కడకు వెళ్తుంటే మమ్మల్ని చూసిన వారు మరణం చేతుల్లోకి వెళుతున్న వెఱ్ఱివారిగా మమ్మల్ని చూశారు. వారి భార్యలు, పిల్లలు బంధువులు చుట్టూ చేరి ఏడుస్తున్నారు. మేము మరలా మీ దగ్గరకు వస్తామని వారికి ధైర్యం చెప్పి మోటు-మోటు ప్రాంతానికి వెళ్ళారు. నిజానికి అక్కడ ఉన్నవారితో జేమ్స్ చాల్మర్స్‌కు చాలా మంచి సంబంధాలు ఉన్నాయి. ఎందుకంటే మూడువారాల క్రితం వారు ఇలా అన్నారు 'మేము మోటు-మోటు వాళ్ళం. మీ మాటలను గ్రహించడం లేదని మీరు అనుకొంటే మీరు పొరబడినట్లే. మీరు రావడానికి ముందు మేము ఒకరితో ఒకరం పోట్లాడుకొంటూ భయంతో బతికేవారం.అయితే ఇప్పుడు పరిస్థితి భిన్నంగా ఉన్నది. మేము మా చుట్టుపక్కల ఉన్నవారితో సమాధానంతో ఉన్నాము. మేము ఆయుధాలు లేకుండా బయటకు రాగలుగుతున్నాము. రాత్రిపూట బాగా నిద్రపోతున్నాము. మేము మా పితరుల యొక్క సంప్రదాయాలన్నిటిని విడిచిపెట్టాము. వృద్ధులు, యవ్వనస్తులు కలసి దేవుని వాక్యము వినడానికి రావడం మీరే చూస్తున్నారు'. అక్కడ జేమ్స్ చాల్మర్స్ భయపడినట్లు ఏమి జరుగకపోగా వారు అతనిని ఎంతో ప్రేమతో చేర్చుకొన్నారు. ఆ రాత్రికి అతనిని దేవాలయంలో ఉంచారు. అక్కడ వారు రెండు సర్వీస్‌లు నిర్వహించారు.

అదే సంవత్సరం అతను దేలెనాలో కొత్త గృహాన్ని నిర్మించుకొన్నాడు. అయితే అక్కడ ఉన్న ప్రజలను చంపడానికి ఇంకో తెగవారు వస్తారు. వారిని కాపాడడానికి ఇతనే ఎటువంటి ఆయుధాలు లేకుండా పోరాటం చేస్తాడు. ఈ ప్రక్రియలో అతని తల మీద ఒక వ్యక్తి బలంగా కొడతాడు. అప్పుడు ఒక స్థానికుడు నువ్వు మా కోసం పోరాడకపోతే మేమందరం చచ్చిపోయేవాళ్ళమని అంటాడు. అక్కడ జేమ్స్ చాల్మర్స్ సువార్త చెప్పి అనేకమందిని ప్రభువు దగ్గరకు నడిపిస్తాడు.

జేమ్స్ చాల్మర్స్ కొత్త మిషనరీ స్థావరాన్ని స్థాపించడానికి దేలెనా నుంచి మైవాకు వెళతాడు. అక్కడ నుండి ఏలేమా అనే ప్రాంతానికి వెళతాడు. అక్కడికి వెళ్ళినప్పుడు వారు జేమ్స్ చాల్మర్స్ అక్కడ ఉంచిన స్థానిక బోధకులు నేర్పించిన బైబిల్ సత్యాలను చెప్పడం విని ఎంతో సంతోషిస్తాడు. వారు మేము ప్రతి రోజు రెండు సర్వీస్‌లని కలిగియున్నామని, ఆదివారమున మూడు కలిగియున్నామని చెబుతారు. వారు వీరిని దేవాలయం దగ్గరకు తీసుకొని

వెళతారు. అక్కడ చాలామంది మహిళలు పెద్దవారు వృద్ధులు అందరూ చేరి జేమ్స్ చాల్మర్స్ వారికి చేసిన పరిచర్యను బట్టి ఆనందిస్తారు. అప్పుడు జేమ్స్ చాల్మర్స్ ఇలా అంటాడు. "గతములో మేము పడిన బాధలు, పొందిన శ్రమలు, కన్నీళ్లు అన్నీ కూడా ఈ ఆనందంతో కొట్టుకొని పోయాయని సంతోషిస్తూ దేవునిని ఆరాధిస్తాడు. ఈ ట్రిప్‌ని బట్టి ఎంతో సంతృప్తి చెందుతాడు.

1882వ సం॥లో అతను తాను అంతకు ముందు సువార్త ప్రకటించిన దక్షిణ కేపుకి వెళతాడు. అక్కడ వారిలో వచ్చిన గొప్ప మార్పును బట్టి సంతోషిస్తాడు. అక్కడ వారు నరమాంస భక్షకాన్ని, పుర్రెల కోసం వేట పూర్తిగా మానివేసి తమ శత్రువుల ను ఇప్పుడు ప్రేమిస్తున్నారు. త్రాగుడు బానిసత్వాన్ని పూర్తిగా మానుకొన్నారు. అక్కడ శత్రువులుగా ఉంటున్నవారు ఇప్పుడు ఒకే గృహములో ఆరాధనకు కూడుకొంటున్నారు.

## 1883వ సంవత్సరంలో పరిచర్య

ఈ సంవత్సరంలో న్యూ గినియాలో పడమర ఉన్న నరమాంస భక్షకుల కోసం అతను అన్వేషణ ప్రారంభించాడు. తర్వాత అతను ఎగె అనే ప్రాంతానికి, అనీ నదివైపు ప్రయాణం చేసి అక్కడ క్రూరమైన ప్రజలు ఒకరినొకరు చంపుకోవడం చూసి ఎంతగానో చలించిపోతాడు. జనవరి 1884లో జేమ్స్ చాల్మర్స్ తీవ్రమైన అనారోగ్యానికి గురవుతాడు. తర్వాత కోలు కొని అతని స్నేహితుడైన గిల్ మోటు భాషకు లిపిని కనుగొనడం మాత్రమే కాకుండా మార్కు, మత్తయి సువార్తను కూడా అనువదించడం జరిగింది. మే నెలలో జేమ్స్ చాల్మర్స్ తాను అంతకుముందు పరిచర్య చేసిన ప్రాంతాలన్నిటిలో కూడా స్థానిక బోధకులను ఉంచుతూ తన యొక్క యాత్రను సాగించాడు. మోటు-మోటును ప్రభువు కోసం గెలిచిన తర్వాత అతని దృష్టి దాదాపు 20 వేల జనాభా ఉండే ఎలిమా జిల్లా మీద పడింది.

## మోటు-మోటులో పరిచర్య

1888 మార్చ్, ఏప్రిల్‌లో అతను వగావగా అనే ప్రాంతానికి వెళ్ళాడు. అక్కడ స్థానికుల రూపం మారి పోయింది. వాళ్ళు కొన్ని సంవత్సరాల క్రితం మొరటైన నరమాంస భక్షకులు. అందులో ఒక స్థానికుడు కొద్దిపాటి ఇంగ్లీష్ కూడా మాట్లాడుతున్నాడు. అతను వారిని మీరు మనిషిని తింటున్నారా అని అడిగితే లేదు మేము ఎప్పటికీ తినము అని చెప్పారు. అక్కడ సాయంత్రం గంట మోగగానే సాయంకాలపు ప్రార్థన కోసం అక్కడ స్థానికులు కూడుకొన్నారు. వారు పాటలు పాడడం విన్నాడు. ఒకప్పటి అటవీకులు నరమాంస భక్షకులు, హంతకులు ఇప్పుడు సువార్త శక్తి వల్ల దేవుని ఆరాధించేవారిగా మారారు అని తన యొక్క డైరీలో జేమ్స్ చాల్మర్స్ రాసుకొన్నాడు.

అతను పది సంవత్సరాల క్రితము దర్శించి సువార్త ప్రకటించిన సైబాయి ద్వీపంలో ఉన్న పరిస్థితులను చూసి ఎంతగానో సంతోషిస్తాడు. ఒకప్పుడు నేను సందర్శించినప్పుడు వారు క్రూరులు, నరమాంస భక్షకులు, చుట్టుపక్కల వారికి మరణ భయాన్ని కలిగించిన వారిలో ఎంత మార్పు! ఇప్పుడు వారు సౌమ్యులుగా, సాధువులుగా మారిపోయారు. ఇప్పుడు వారిలోనుండి క్రైస్తవులు, సేవకులు ఒకే గృహములో కూడుకొని ఆరాధిస్తూ, ప్రార్థనలు చేస్తున్నారు. సువార్త యొక్క శక్తి వర్ణనాతీతం. అక్కడ వారి యొక్క రాజు యవ్వనస్తుడు, చురుకైన వాడు. అతను బోధకులకు ఎంతగానో సహాయపడుతూ సంఘములో డీకన్‌గా ఉన్నాడు. ఎవరైనా ఆరాధనలో నిద్రపోతే ఇతను వారి దగ్గరకు పోయి తల పైకెత్తి మేలుకో నిద్రపోవద్దు అని చెప్పేవాడు. అక్కడ ఉన్న టుగారే ప్రజలు చాలా క్రూరులు. ఎప్పుడూ యుద్ధము చేస్తూ ఉంటారు. వారిని సువార్తతో చేరుకోవాలనే ఆశ జేమ్స్ చాల్మర్స్‌ని వెంటాడింది. ఇతను మరి కొంతమంది బోధకులతో వెళ్ళి టుగారే ప్రజలకు సమీపంలో గుడారం వేసుకొన్నారు. అప్పుడు దాదాపు వందమంది కత్తులతో, ఆయుధాలతో మావైపు



జేమ్స్ చాల్మర్స్, ఇంకో మిషనరీని వెనుకనుంచి పదునైన రాళ్ళతో తల మీద కొట్టారు. నేలమీద పడిపోయిన తర్వాత వారి తలలను నరికి వారి శరీరాలను ముక్కలు ముక్కలుగా కోసి వంట వండడానికి అక్కడ ఉన్న స్త్రీలకు ఇచ్చి ఆ రోజే తిన్నారు. అతను దేవుని పనిలో ఉండగా చనిపోవాలనుకొన్నాడు. ఆలాగే జరిగింది. నరమాంస భక్షకులైన అటవీకులకు, మరణానికి అతనెప్పుడూ భయపడలేదు. అతని యొక్క ప్రాణాన్ని నరమాంస భక్షకుల విమోచన కొరకు వెలగా చెల్లించాడు. జేమ్స్ చాల్మర్స్ గినియా కొరకు న్యూ గినియాలో చనిపోయాడు. అతను చనిపోవడానికి వారం ముందు తన స్నేహితునికి ఉత్తరం రాస్తాడు. అందులో... "సమయం తక్కువగా ఉన్నది. చేయాల్సిన పని చాలా ఎక్కువగా ఉన్నది. ప్రభువు కోసం పనిచేస్తున్నప్పుడు నీ వంతు ముగించబడింది నా దగ్గరకు రా అని ప్రభువు పలికితే వినడం ఎంత భాగ్యము అని రాస్తాడు.

రావడం మేము చూశాము. వారు వీళ్ళకు ఎటువంటి హానిచేయలేదు. జేమ్స్ చాల్మర్స్ వారికి బహుమానాలు ఇచ్చి స్నేహము ఏర్పరచుకొన్నాడు. కొన్ని వందల మంది అక్కడ ప్రభువును నమ్ముకొన్నారు. తర్వాత జేమ్స్ చాల్మర్స్ అక్కడ వారి కోసం కొంతమంది బోధకులను నియమించాడు. 13 సంవత్సరాల తర్వాత రోరోటాంగాలో ఉన్న తన యొక్క పాత స్నేహితుల ను చూస్తాడు. ఆ ఆదివారం రోరోటాంగా భాషను అనర్గళంగా మాట్లాడుతూ వాక్య పరిచర్య చేస్తాడు. అక్కడ ఉన్న అనేకమంది యవ్వనస్తులు న్యూ గినియాలో పరిచర్య చేయడానికి ఎంతో ఆసక్తిని కనబరచారు. ఐతుటకైలో ఉన్న సంఘం అయితే జేమ్స్ చాల్మర్స్ ఫ్లై రివర్ ప్రాంతానికి వెళ్ళడానికి పడవను కూడా సిద్ధపరచారు. అక్కడ శిక్షణా కేంద్రంలో ఉన్న అనేకమంది విద్యార్థులు న్యూ గినియాలో పంటకోయడానికి సన్నద్ధులై ఉన్నారు.

## ఫ్లైనది వైపు ప్రయాణము

క్వీన్స్‌లాండ్‌లో జేమ్స్ చాల్మర్స్ తన 50 వ పుట్టినరోజు అప్పుడు ఇలా అంటాడు "నేనిప్పుడు 50 సంవత్సరాలవాడను. నేను 25 సంవత్సరాలు తగ్గించుకొని అదే పనిలో నిమగ్నమై పోవాలని ఆశపడుతున్నాను. నా కోరిక యవ్వనములో కన్నా బలముగా ఉంది. నా ప్రభువు ఎక్కడ ఆజ్ఞాపిస్తే అక్కడ పనిచేయడమే. మరలా అతను న్యూ గినియాకు వచ్చినప్పుడు ఎంతగానో సంతోషిస్తాడు. ఎందుకంటే టోరిపి స్థానికులు 8 మంది బాప్తీస్మము పొందుతారు. అయితే వారిలో స్త్రీలు ఎవ్వరూ లేకపోవడంతో బాధపడుతూ "మనము క్రీస్తు కొరకు స్త్రీలను గెలిచేవరకు నిజమైన సజీవమైన సంఘాన్ని ఆశించలేమని అభిప్రాయపడతాడు. అతను న్యూ గినియాలో పనిచేయడానికి న్యూ గినియాలో శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనే ప్రణాళికలను కలిగియున్నాడు. 1893సం॥లో సమయోచితమైన సహాయంలాగా అతనికి ప్రభుత్వం స్టీమ్ లాంచ్ బోట్‌ను పంపిస్తుంది. దానిపేరు మిరో. అంటే సమాధానం అని అర్థం. 1893 జనవరి 5న ఆ బోట్ ఇతని దగ్గరకు వస్తుంది. అది వచ్చిన వెంటనే అతను ఏ మాత్రము ఆలస్యం చేయకుండా తాను స్థాపించిన మిషన్ కేంద్రాలన్నిటిని సందర్శించడానికి వెళతాడు. అతను మరలా మోటు-మోటుకు వచ్చినప్పుడు ఒకామె రక్షణ పొంది బాప్తీస్మం పొందుతుంది. మిగిలిన వారు కూడా పదుల సంఖ్యలో బాప్మీస్తం పొంది సంఘములో చేర్చబడ్డారు. ఆమె ఆ ఏలేమా జిల్లా అంతటిలో మొట్టమొదటి మహిళా క్రైస్తవురాలు. ఆమె అక్కడ నుంచి తన భర్తతో పాటు వెళ్ళే సమయంలో జేమ్స్ చాల్మర్స్‌తో "నేను యేసును ప్రేమిస్తాను, నేను ఎప్పుడూ కూడా ఆయనను ప్రేమిస్తూనే ఉంటాను" అని చెప్పింది.

తన మిరోబోట్‌తో వారు ఎంతో కష్టతరమైన ఫ్లై రివర్ ప్రాంతానికి వెళతారు. వారి ప్రయాణమంతటిలో కూడా అక్కడ స్థానికులు వీరి మీద శత్రుత్వమే చూపించారు. వారితో స్నేహం పెంచుకోవాలని వీరు ప్రయత్నించినా వారు ఆసక్తి చూపించలేదు. అక్కడి వారు మొదటిసారి తెల్లవారిని చూశారు. వచ్చే స్టాప్‌లో దాదాపు 150 మంది నరమాంస భక్షకులు వీరి బోట్‌ని చుట్టు ముట్టారు. జేమ్స్ చాల్మర్స్ వారితో స్నేహంగా మెలిగి వారికి బహుమానాలు ఇచ్చి దేవుని ప్రేమ గురించి చెబుతాడు.

ఫ్లై రివర్‌ని చేరుకోవడం కోసం సాగువనే ప్రాంతాన్ని ఎన్నుకొని 1896వ సం॥ నుంచి1900 వసం॥ వరకు

అలుపెరగని పోరాటం చేశాడు. ఆ ప్రాంతంలో మలేరియా జ్వరాలు ఎక్కువ. పరిశుభ్రమైన నీరు ఉండదు. కేవలము పరిచర్య కోసమే అక్కడ ఉన్నాడు. అంధకారంలో ఉన్న ప్రజల యొక్క ఆధ్యాత్మిక జీవితాల కోసం ప్రయాసపడ్డాడు. కొన్ని నెలల తర్వాత అతను పనిచేస్తున్న కివాయి ద్వీపంలో కొన్ని వందల మంది బాప్తీస్మము పొంది సహవాసంగా కూడుకొని సంఘములో ఆరాధించారు. 1900లో మరలా ఫ్లై రివర్ మీదకు వెళ్ళి మిషనరీ పని చేశాడు. 1900లో అతను ఆరుగురిని ఫ్లై రివర్‌కు పంపిస్తాడు. వారు అక్కడే నాలుగు నెలలు ఉండి మరలా తిరిగివస్తారు. అక్కడ దేవుడు వారి పరిచర్యను బహుగా దీవించాడు. వారు అక్కడ ప్రజలతో జీవిస్తూ యేసుక్రీస్తు సువార్తను ప్రకటించారు. వారు సాగువనే ప్రాంతానికి తిరిగి వస్తున్నప్పుడు అక్కడ ఉన్నవారందరూ ఏడుస్తూ త్వరగా రండి వచ్చి మాకు ఇంకా బోధించండి అని వేడుకొన్నారు. సాగువనేలో ఉన్న స్థావరాన్ని అక్కడ ఉన్న స్థానిక బోధకుడికి అప్పగించి, జేమ్స్ చాల్మర్స్ దారు అనే ప్రాంతానికి తన స్థావరాన్ని మారుస్తాడు. అతని రెండవ భార్య అనారోగ్యంతో అక్టోబర్ 25న 1900వ సంవత్సరంలో చనిపోతుంది. ఆమె చనిపోవడానికి ముందు 14 వారాలపాటు అనారోగ్యంతో బాధపడింది. ఆ సమయంలో ఆమె యొక్క విశ్వాసం బలపరచబడింది. ఆమె పట్ల ప్రేమ పెరిగి, నేను వెడలిపోయి క్రీస్తుతో ఉండాలనే కోరిక తీవ్రముగా ఉండేదని చాల్మర్స్ రాస్తాడు.

## ముగింపు

భార్య చనిపోయిన తర్వాత అతనిని ఇంగ్లాండ్‌కు రమ్మని బతిమాలితే దానికి సమాధానముగా అతను " నేను మరింత ఎక్కువగా న్యూ గినియాకు అటాచ్ అయ్యానని, నేను మరణానికి సమీపంగా ఉన్నాను. పాత సన్నివేశాలు, సంతోషాలు, దు:ఖాలను కోల్పోతానని భయపడుతున్నాను" అని అంటాడు. ఏప్రిల్ 4వ తేదీ 1901 సంవత్సరంలో అతను చివరి మిషనరీ సముద్రయానం చేస్తాడు. అతను గోయారిబరి ద్వీపం అనే ప్రాంతములో ఉన్న అటవీకులతో స్నేహము పెంచుకోవడానికి వెళతాడు. ఏప్రిల్ 7 ఈస్టర్ రోజున ఆ ప్రాంతానికి వెళ్ళిన బోట్‌లోనికి అక్కడ ఉన్న ఆటవీకులు గుంపులాగా వచ్చి చేరుతారు. నేను మరలా మరుసటి రోజు వస్తానని వారికి మాటిచ్చి వారిని బోట్‌లో నుంచి వెళ్ళేలా చేస్తాడు. మరుసటి రోజు వారు ఆయుధాలతో అక్కడకు చేరుకొంటారు. బ్రేక్‌ఫాస్ట్ కంటే ముందే జేమ్స్ చాల్మర్స్ అక్కడకు చేరుకొంటాడు. అక్కడ బోట్ రోజంతా ఆగి ఉంది. అయితే జేమ్స్ చాల్మర్స్ మాత్రము తిరిగిరాలేదు. అక్కడ జరిగింది ఏమిటంటే వారు ఒడ్డుమీదకు రాగానే వారిని విందు కోసమని ఒక పెద్ద బంగ్లాలోకి తీసుకొని వెళ్ళారు.జేమ్స్ చాల్మర్స్, ఇంకో మిషనరీని వెనుకనుంచి పదునైన రాళ్ళతో తల మీద కొట్టారు. నేలమీద పడిపోయిన తర్వాత వారి తలలను నరికి వారి శరీరాలను ముక్కలు ముక్కలుగా కోసి వంట వండడానికి అక్కడ ఉన్న స్త్రీలకు ఇచ్చి ఆ రోజే తిన్నారు. అతను దేవుని పనిలో ఉండగా చనిపోవాలనుకొన్నాడు. ఆలాగే జరిగింది. నరమాంస భక్షకులైన అటవీకులకు, మరణానికి అతనెప్పుడూ భయపడలేదు. అతని యొక్క ప్రాణాన్ని నరమాంస భక్షకుల విమోచన కొరకు వెలగా చెల్లించాడు. జేమ్స్ చాల్మర్స్ గినియా కొరకు న్యూ గినియాలో చనిపోయాడు. అతను చనిపోవడానికి వారం ముందు తన స్నేహితునికి ఉత్తరం రాస్తాడు. అందులో... "సమయం తక్కువగా ఉన్నది. చేయాల్సిన పని చాలా ఎక్కువగా ఉన్నది. ప్రభువు కోసం పనిచేస్తున్నప్పుడు నీ వంతు ముగించబడింది నా దగ్గరకు రా అని ప్రభువు పలికితే వినడం ఎంత భాగ్యము అని రాస్తాడు. జేమ్స్ చాల్మర్స్ హతసాక్షి అయ్యాడనే వార్త ప్రపంచాన్ని దు:ఖములో, బాధలో ముంచి వేసింది. రోరోలాంగోలో, న్యూ గినియాలో ఉన్న స్థానిక బోధకులలో మన పనిని ముగించడానికి జేమ్స్ చాల్మర్స్ వలె చనిపోవడానికి కూడా సిద్ధంగా ఉండాలనే జ్వాలను వారి యొక్క హృదయంలో మండించింది. న్యూ గినియాలో అతనితో పాటు ప్రారంభ దినాలలో పరిచర్య చేసిన రువటోక అనే వ్యక్తి " నా తండ్రియైన జేమ్స్ చాల్మర్స్ యొక్క దేహాన్ని మరలా చూడలేకపోతున్నందుకు నేను చాలా ఏడ్చాను. అయితే ఆయనను మరలా నేను పరలోకములో చూస్తాను. జేమ్స్ చాల్మర్స్ ఎక్కడైతే చంపబడ్డాడో ఆ ప్రాంతములో నా యొక్క మిగిలిన శక్తినంతా అక్కడే వాడి పరిచర్య చేయాలనేదే నా ఆశ. ఆ గ్రామంలోనే జీవిస్తాను. వారు ఎక్కడైతే చంపబడ్డారో, వారు యేసుక్రీస్తు పిల్లలయ్యేటట్లు అక్కడి ప్రజలకు యేసుక్రీస్తును ప్రకటిస్తాను. నా ఆశ ఇదే". **సమాప్తం.**

**– డా. నాసరయ్య,** వైజాగ్



# హలో... నాయకా!

*ఆరాటం, పోరాటం ఎందుకు?*

“దేవా ఎవరినైనా రక్షించగల ప్రభువును గూర్చి అందరికీ చెప్పగల ఒక నోబడీగా నన్ను చేయండి” అని అంటాడు వారెన్ వియర్స్బి.

నీవు నోబడీవా లేక సంబడీవా? క్రీస్తులో సంబడీ అయితే పర్వాలేదు. లోకంలో సంబడీ అయితే ప్రమాదమే. లోకంలో గొప్పగా ఎంచబడునది దేవుని దృష్టికి అసహ్యాము.

నాయకత్వం కోసము ఆరాటము, పోరాటము పనికిరావు. లంచాలు, కంచాలు, మంచాలు లోకంలో నాయకత్వం కోసము వాడతారు. ఇవి విశ్వాసులకు పనికి రావు. నిజమైన నాయకుడు తన్నుతాను హెచ్చించుకొనడు. దీనమనస్కుడై ఉంటాడు. గుర్తింపు, మెప్పు కోసం ఆరాటము పనికిరాదు. మనుష్యులు మెచ్చుకొనువాడు యోగ్యుడు కాడు. మనుష్యుల మెప్పుకొరకే పనిచేస్తే నీ పని అంతా కాలిపోతుంది. ఆ దినమందు ప్రతి వానికి తద్దినం ఉంది. ఆ రోజు నీ పనికి అగ్ని పరీక్ష. నీకు తప్పుడు ఉద్దేశాలు ఉంటే నీ పనంతా కాలిపోతుంది.

నీవు ప్రభుని మహిమను దొంగిలించే దొంగవా? మనుష్యులు నిన్ను మెచ్చుకొని పొగడుతుంటే సంతోషంగా ఉందా? పైకి వినయంగా మాట్లాడుతూ లోపల నేనే నంబర్ వన్ అనుకుంటున్నావా? వేషధారీ.

రెండు కొంగలు ఒక కప్పను ఒక పుల్ల సహాయంతో వేరే చెరువులోకి తీసికొని పోతున్నాయంట. క్రిందనున్న ప్రజలు ఈ వింత చూసి ఆహా ఏమి ఐడియా! ఎవరిదీ ఐడియా అని అడిగారంట. పుల్లను పట్టుకొని వేలాడే కప్ప నోరు తెరచి “ఈ ఐడియా నాదే” అని చెప్పి కిందబడి చచ్చిందంట. నీ ఐడియాలు, నీ జ్ఞానంతో నాయకుడవు కావాలనుకోవడంకంటే తెలివితక్కువతనం మరొకటి ఉండదు.

ప్రభువును, బోధకుడైన యేసు కట్టుబానిసగా మారితే మట్టివారము, వట్టివారమైన మనమేపాటివారము? నాయకుడు సెల్ఫ్ మేడ్ కాదు. గాడ్ మేడ్. దేవుని చేత ఏర్పరచబడి, విరుగ గొట్టబడి, నలుగగొట్టబడి ఫలిస్తాడు, అంతేగాని తన్ను తాను సాతానువలె హెచ్చించుకోడు.

ఈ మధ్య మన అహం సోషల్ మీడియా ద్వారా బాగా బలిసి పోయింది. సోషల్ మీడియా ద్వారా స్పిరిచ్యువల్ మీడియాను ప్రకటిస్తూ గొప్ప పేరు సంపాదించుకుంటున్నారు. మా మెంటర్, మా లీడర్, మా మోడల్ అని మనలను గూర్చి ఎవరైన చెప్పుకొంటే పలావు తిన్నంత సంతోషంగా ఉంటుంది.

నాయకత్వం కోరుకోవద్దంటావన్నా అని అడగవచ్చు. కోరుకో కాని హెచ్చించుకొని దానికోసము వెంపర్లాడవద్దు. తగిన సమయంలో దేవుడు హెచ్చించునట్లు ఆయన బలిష్టమైన హస్తము

*నాయకత్వం కోసము ఆరాటము, పోరాటము పనికిరావు.*

*లోకంలో నాయకత్వం కోసము లంచాలు, కంచాలు, మంచాలు వాడతారు.*

*ఇవి విశ్వాసులకు పనికి రావు.*

క్రింద దీనమనస్కుడవై ఉండు. నాయకుని మనసు మారి రూపాంతరం పొందాలి.

**నాయకునికి ఉండాల్సిన మనసు**

1. పరిశుద్ధాత్మునిచే మార్చబడిన సహజ ప్రవృత్తి (స్పందించే సహజ గుణం)
2. సేవామనసు, వినయము, సాత్వికము
3. నిజ విమర్శను అంగీకరించే మనసు
4. ఎవరైనా తనను విమర్శిస్తే కస్సుమని లేవడు
5. దేవుడు ఇతరులను బాగా వాడుకొంటే అసూయ ఉండదు
6. ఇతర నాయకులను తనకంటే యోగ్యులుగా ఎంచుతాడు
7. వ్యర్థమైన వాటియందు అతిశయపడడు
8. లోకపు మెప్పును కోరడు
9. దేవుడు బాగా వాడుకొంటున్నప్పుడు ఆత్మీయ గర్వముండదు
10. దూషణ, భూషణ, తిరస్కారములకు చలించదు
11. ప్రభువు ఘనతను మహిమను వెదకుతాడు. స్వకీయ మహిమను కోరడు
12. సామాన్య జీవితము. లగ్జరీ కాదు
13. దేవుని పిలుపును కలిగియుండి ఆ మేరకే ప్రయాసపడతాడు
14. ఇతరుల తప్పులను సహించి క్షమిస్తాడు
15. ఇతరులపై అతిశయపడడు

**కొందరు నాయకులు ఏమి చెప్పారంటే?**

1. గోధుమ గింజ చచ్చి విస్తారంగా ఫలిస్తుంది. తర్వాత ఆ గింజ కనపడదు (అనామకుడు)
2. లూథరే నా శత్రువు (మార్టిన్ లూథర్)
3. సంగీత ఆర్కెస్ట్రా నడిపించు వాడు ఆడియన్స్ వైపు వీపు ఉంచుతాడు (మేక్స్‌లుకాడో)
4. పరిచారము చేసేవాడే నాయకుడు. చేయించు



కొనేవాడు కాదు (ఆస్వాల్డ్ శాండర్స్)

5. సెల్ఫ్ మేడ్ ఆత్మీయ నాయకత్వం ఉండదు. నడిపింపబడే వారిలో కంటే నాయకునిలో పరిశుద్ధాత్ముడు ఎక్కువగా పనిచేయాలి (ఆస్వాల్డ్ శాండర్స్)
6. నిజమైన సేవకుడు మార్గంలో నడిపిస్తాడు. మార్గం చూపించడు (లియోనార్డ్ రావెన్ హిల్)
7. దేవుని సన్నిధిలో రహస్యముగా మోకాళ్ళమీద నాయకుడు తయారవుతాడు (జాన్ ఓవెన్)
8. నాయకుడునైన నేనే ముందు మారాలి. ఇదెంత కష్టమో నాకర్థమైతే ఇతరులను మార్చుట నాకర్థమవుతుంది (జాన్ సి మేక్స్‌వెల్)
9. తన్నుతాను తగ్గించుకొన్న నాయకుని చేతిలో అధికారము క్షేమంగా ఉంటుంది (జాన్ స్టాట్)
10. ఆత్మీయ నాయకుడు దేవుని పిలుపును కలిగి ఉంటాడు. అతడు చేయుపని అతని పిలుపుకు సంభందించినదే (జాక్ పూనెన్)

**– జక్కి దేవరాజు,** విజయవాడ




# నీ శిష్యునిగా...

"ప్రభువా నీ శిష్యుడను – నీతోనే ఉండెదను, నిన్ను వెంబడించెదను – నిన్నే సేవించెదను"

బైబిల్ స్టడీకి వచ్చిన వాళ్ళందరూ పెద్ద గొంతుతో పాడుతున్న పాటను వింటూ చప్పట్లు కొడుతూ వాళ్ళతో పాటు తన గొంతు కూడా శృతి కలిపాడు విజయ్. గోడవైపు చూస్తూ కొందరు, చిన్న చప్పుడైనా తలతిప్పి అటువైపు చూస్తూ పాడేవాళ్ళు కొందరు, తిరుగుతున్న ఫ్యాన్ వంకా, గడియారం వంకా చూస్తూ పాడుతున్నవాళ్ళు కొందరు, పుస్తకంలో నుంచి తల పైకెత్తకుండా పాడుచున్న వాళ్ళు కొందరు... ఇలా ఆ బైబిల్ స్టడీ గదంతా పాటలతో మార్మోగుతోంది. అప్రయత్నంగా విజయ్ పెదాలు కదులుతున్నాయి. కానీ ఆలోచనలు మాత్రం ఎక్కడెక్కడో తిరిగొస్తు న్నాయి. పాటను పాడడం ఎంత సులువో, మనసును ఆధీనంలో ఉంచి అర్థవంతంగా స్తుతించడం ఎంత కష్టమో అర్థమైంది విజయ్‌కి.

"నాగటిపై చేయి వేసి నేను వెనుక తిరిగి చూడనెన్నడూ

క్రీస్తు సేవా పొలములో దున్నుకొంటు సాగివెళ్లెదన్" అంటూ పాడడం మొదలైంది.

శిష్యుడంటే ఎవరు? తప్పుల్ని ఒప్పుకొని వెంబడించేవాడా? తప్పుల్ని కప్పుకొని దేవునిని వెంబడిస్తున్నట్లు నటించేవాడా?

ప్రభువు శిష్యుడనని చెప్పుకోవడం చాలా బాగుంటుంది. కానీ ప్రభువుతో ఉండడం, ప్రభువును వెంబడించడం, ప్రభువును సేవించడం అనే మాటల్లోని అంతరార్థం ఎంత లోతైనదో, మనుషుల కోసం కాకుండా మనస్ఫూర్తిగా ప్రభువుకు శిష్యుడిగా ఉండడంలోని ఆత్మీయ ఆనందాన్ని తానెందుకు కోల్పోతున్నాడో అర్థం కావట్లేదు విజయ్‌కి.

'ప్రభువుతో కాకుండా నేను ఎవరితో ఉంటున్నాను? ప్రభువుని కాకుండా ఎవర్ని వెంబడిస్తున్నాను? ప్రభువుని విడిచిపెట్టి ఎవర్ని సేవిస్తున్నాను?' అనే ఆలోచనలతో ఉన్న విజయ్ భుజం మీద చేయి పడడంతో తలతిప్పి చూశాడు.

"తమ్ముడూ బాగున్నావా?"

"అన్నా... బాగున్నానన్నా. మీరెలా ఉన్నారన్నా?"

"బాగున్నాను తమ్ముడూ! డిటి క్యాంప్ బాగా జరిగిందా తమ్ముడూ"

"జరిగిందన్నా... నిన్ననే ఇంటికొచ్చాను"

"చాలా సంతోషం తమ్ముడూ. క్యాంప్‌లో నేర్చుకొన్న విషయాలు ఎప్పుడూ జ్ఞాపకం చేసుకొంటూ ఉండాలి. శిష్యునిగా దేవుని వాక్యాన్ని ఎక్కువ సేపు చదువుతూ, ప్రార్థన చేసుకో. దేవునికి నిజమైన

శిష్యుడిగా ఉండడానికి ప్రయత్నం చేయాలి. మళ్ళీ గత జీవితానికి వెళ్ళకూడదు"

"అవునన్నా... నేనూ అదే ఆలోచిస్తున్నాను. కానీ అక్కడ విన్నదానికి, ఇక్కడ చేస్తున్న దానికి పొంతన లేదన్నా. క్యాంప్ జరిగిన మూడు రోజులూ ఏదో ప్రత్యేక లోకంలో ఉన్నట్లు ఉందన్నా. అందరితో పాటు కూర్చున్నాను. చెప్పింది విన్నాను. పెట్టింది తిన్నాను. సహవాసంలో ఆనందించాను. ఆ గేటుదాటి బయటికి వచ్చానో లేదో మళ్ళీ గతమంతా నన్ను చుట్టుకుంది. నాలో ఏదో అసంతృప్తి"

"ఏమైంది తమ్ముడూ"

"పరిశుద్ధంగా, వినయం కలిగి ఉండాలనుకున్నా ఉండలేకపోతున్నాను. ఇంద్రియాల మీద నిగ్రహం లేదు. చూడకూడదనుకొంటూనే చూస్తున్నాను. చేయకూడదనుకొంటూనే పొరపాట్లు చేసేస్తున్నాను. అటు లోకంలో ఇమడలేక, ఇటు నాలో నేను సర్దుబాటు చేసుకోలేక సతమతమవుతున్నాను".

"ఇలాంటప్పుడే జాగ్రత్తగా ఉండాలి తమ్ముడూ. ప్రార్థనలో ఎక్కువ సమయం గడపాలి. వాక్యాన్ని ధ్యానించాలి. గ్రాడ్యుయేట్స్ అన్నవాళ్ళ దగ్గరకు వెళ్ళాలి. వాళ్ళతో మాట్లాడి నీకున్న సందేహాలు తీర్చుకోవాలి. నిన్ను సంఘర్షణకు గురిచేస్తున్న విషయాలను వాళ్ళకు చెప్పి సలహాలు తీసుకోవాలి. దంతాలు శుభ్రం చేసుకొన్నట్లే ప్రతీ రోజూ మనల్ని మనం శుభ్రం చేసుకోవాలి"

"నిజమేనన్నా. పాపిని ప్రేమించి ఈ లోకానికి వచ్చి ప్రాణం పెట్టిన దేవుడికి నన్ను నేను సంపూర్ణంగా సమర్పించుకోవాలని ఉంది. జీవితాంతం ఆయననే వెంబడించాలని, క్రీస్తు ప్రేమను నా తోటి విద్యార్థులకు చూపించాలని నేర్చుకొన్నాను. క్యాంప్ చివర్లో నేను తీసుకొన్న నిర్ణయాలు కూడా ఇవే. కానీ పరిస్థితుల ను బట్టి నేనెవర్ని ద్వేషించాలో, ఎవర్ని ప్రేమించాలో అర్థం కావట్లేదన్నా"

"నీ మాటల్లోనే దానికి సమాధానం ఉంది తమ్ముడూ"

"ఎలా అన్నా?"

"దేవుడు ఈ లోకాన్ని ఎంతో ప్రేమించాడనే విషయం నీకు తెలుసు కదా! అంటే లోకంలో మనతో పాటు దేవునిని ఎరుగని వారు కూడా ఉంటారుగా! వాళ్ళకోసం మనం ప్రార్థన చేయాలి. వాళ్ళని ప్రేమించాలి. దేవుడి కంటే ఎక్కువగా దేనినీ ప్రేమించకూడదని దేవుని వాక్యం చెప్తుంది. మనకు నచ్చిన వాళ్ళను ఎలాగూ ప్రేమిస్తాం. మనకు నచ్చని వాళ్ళని ప్రేమించడం, వాళ్ళకోసం ప్రార్థన చేయడం అలవాటుగా చేసుకోవాలి"

"............."

"చూడు తమ్ముడూ... జీవితానికి ఉప్పు వెలుగు రెండూ అవసరమే. ఉప్పు ఆహారానికి రుచినీ, దేహానికి ఆరోగ్యాన్నీ ఇస్తుంది. వెలుగు అంధకారంలో దారి చూపుతుంది. దేవునిని తెలుసుకొన్న తర్వాత ఈ లోకానికి నువ్వు రుచినిచ్చే ఉప్పులా, దారి చూపించే వెలుగులా ఉండాలి. అందుకే శిష్యుడిగా జీవించాలని నిర్ణయం తీసుకొన్నాక నీ ప్రవర్తన విషయంలో జాగ్రత్తగా ఉండాలి. నీ నోటిమాట నలుగురిని దేవునిలోకి నడిపించేదిగా ఉండాలి. నీ ప్రవర్తన ఇతరులకు మాదిరిగా ఉండాలి. అప్పుడే నిజమైన శిష్యునిగా జీవించగలుగుతావు"

"అవునన్నా... మీరు చెప్పింది నిజమే! నిర్ణయాలు తీసుకోవడం సులువు, నిలబడడం కష్టం! అంగీకరించానని నోటితో ఒప్పుకోవడం తేలిక, హృదయాన్ని సంపూర్ణంగా సమర్పించడం కష్టం! ఖాళీగా ఉన్నప్పుడల్లా పాత స్నేహితులు, పాత అల వాట్లు గుర్తొస్తున్నాయి. ఎప్పుడో చేసిన చెడ్డ పనులన్నీ కళ్ళముందు నిలుస్తున్నాయి. వాటిని అధిగమించి నన్ను నేను కొత్తగా నిర్మించుకోవాలి. తీసుకున్న నిర్ణయాలకు కట్టుబడి జీవించాలి. చూపులోనూ, మాటలోనూ, ప్రవర్తనలోనూ, విశ్వాసంలోనూ ఇతరులకు మాదిరిగా వెలుగుగా ఉండాలి".

"మనిషెప్పుడూ ఒక రాత్రిలోనే సంపూర్ణుడుగా మారడు. గొప్ప పనులన్నీ ఒక రోజులోనే చేయలేము. అది నిరంతరం జరగాల్సిన ప్రక్రియ. రక్షణ పొందడం వెంటనే జరిగే కార్యమైనా, పరిశుద్ధంగా జీవించడం జీవితకాలం సాగే ప్రక్రియ. గనుక పాపాన్ని ద్వేషిస్తూ, ఆయనలోని దీనత్వాన్ని, దయాళుత్వాన్ని, క్షమాగుణాన్ని, ప్రేమించే తత్వాన్ని ఆదర్శంగా తీసుకోవాలి. శత్రువుల్ని కూడా మనస్ఫూర్తిగా క్షమించడం అలవాటు చేసుకోవాలి.

శిష్యుడినని చెప్పుకొంటూ దేవునికి దూరంగా ఉండడమంటే... మనకు కళ్ళు ఉన్నా చీకట్లో తడుములాడుకోవడం లాంటిది! నీ కన్ను నీకు దారి



చూపాలి. నలుగురిని ఆ దారిలో నడిపించాలి. బంధు ప్రీతిని, సిరి సంపదల పట్ల ఆపేక్షను విడిచిపెట్టి నిన్ను నువ్వు దేవుని చిత్తానికి అప్పగించుకోవాలి. ఆయన ఆజ్ఞలను పాటించాలి. అప్పుడే దేవుడు నీ చేతిని పట్టుకొంటాడు"

విజయ్ ఆలోచనలో పడ్డాడు. అవును... అన్న చెప్పింది నిజమే! లోకం పుట్టినప్పటి నుంచీ ఆకర్షణలు ఉన్నాయి. వ్యామోహాలు కొనసాగుతూనే ఉన్నాయి. అవసరమైన దాన్ని వదిలిపెట్టడం, అక్కర్లేని దాన్ని తలమీద మోసుకొని తిరగడం ఒక అలవాటుగా మారిపోయింది.

'ఇప్పుడు నేనెలా ఉన్నాను? వెచ్చగా ఉన్నానా? చల్లగా ఉన్నానా? లేక అటూ ఇటూ కాకుండా నులివెచ్చగా ఉన్నానా?' శిష్యుడినని చెప్పుకొంటూ తిరుగుతున్నాను గానీ దేవునికి నిజమైన శిష్యుడిగా ప్రవర్తించలేక పోతున్నాననే భావన మనసులో మెదలగానే విజయ్‌లో పశ్చాత్తాపం మొదలైంది. మాటలో మృదుత్వం, ప్రవర్తనలో మాదిరి కనబర్చిన దేవునిని తన ప్రవర్తన ద్వారా నలుగురికీ పరిచయం చేయాలని మనసులో నిర్ణయించుకొన్నాడు?

కళ్ళు మూసుకొని తనలో తాను 'దేవా... నన్ను క్షమించు. లోకానికి దూరంగా ఉన్నట్లు ప్రవర్తిస్తున్నానా? లేక నాలోనే ఉన్న లోకానికి దగ్గరవుతున్నానా? నిజమైన శిష్యుడిగా నా ప్రవర్తనను దిద్దుకోడానికి నాకు కృపను అనుగ్రహించు. పరిపూర్ణ మనసుతో నిన్ను వెంబడిస్తూ లోకానికి ఉప్పులా, వెలుగులా మారడానికి నాకు సహాయం దయచేయండి. నీ నోటినుంచి నన్ను ఉమ్మి వేయకముందే నన్ను నేను వాక్యంతో కడుక్కొని నీలో నిలిచి ఉండి ఆత్మ ఫలాలు ఫలించే కృపను, నులివెచ్చని శిష్యుడిగా కాకుండా నిలకడ కలిగి నిన్ను వెంబడించడానికి నీ కృపను అనుగ్రహించు. నాతోటి విద్యార్థుల్ని నీ దగ్గరకి నడిపించడానికి సహాయం దయచేయండి..'

కళ్ళు తెరచి చిరునవ్వుతో అన్నవైపు చూశాడు.

**– డా. జడా సుబ్బారావు,** నూజివీడు




# ఆధ్యాత్మిక నాయకుడు

మనుషులు రెండు రకాలు. దీనికి శాస్త్రీయంగా ఎలాంటి ఆధారాలు లేకపోయినా ఇది మౌళికంగా, సాంఘికంగా జరిగే విభజన. నడిపించేవారు కొందరైతే, నడిచేవారు ఇంకొందరు. సంఘంలో, సమాజంలో నడిపించే వారు తక్కువ సంఖ్యలో ఉంటే, నడిచేవారు లక్షల్లో ఉంటారు. నడిచే కేటగిరిలో చేరేందుకు పెద్దగా ప్రత్యేకతలేవీ అవసరం ఉండదు. నడిపించే స్థాయి పొందాలంటే మాత్రం భిన్నమైన లక్షణాలు ఉండి తీరాలి. లక్షల మంది వెనక నడుస్తూ ఉంటే ముందు కాగడా తీసుకొని నడవడానికి ఎంతో సత్తా కావాలి.

క్రైస్తవ సంఘాల్లో, సంస్థల్లో నాయకులు ఎంతో మంది ఉన్నారు. వీరిని ఆధ్యాత్మిక నాయకులని అంటాం. ఒక భక్తుడు ఇలా అంటాడు "ఒక ఆధ్యాత్మిక నాయకుడు తన జీవితంలో మొదటి స్థానం ఆధ్యాత్మికతకు, రెండవస్థానం నాయకత్వానికి ఇవ్వాలి". ఒక విశ్వాసిలో నాయకత్వ లక్షణాలు ఎన్ని ఉన్నా తన జీవితంలో ఆధ్యాత్మికతకు మొదటిస్థానం లేకపోతే లోకంలో ఉన్న నాయకునికి అతనికి తేడా ఏమీ ఉండదు. ఆధ్యాత్మిక నాయకుడు దేవుని వాక్యం ప్రకారం నడుచుకోవాలి. వాక్యం ఆ నాయకుని క్రియల్ని, ఆలోచనల్ని ప్రభావితం చేయాలి. నిర్ణయాలకోసం దేవుని సన్నిధిలో కనిపెట్టాలి. అప్పుడే ఆ నాయకుని వ్యక్తిగత జీవితం, పని అత్యున్నత విలువలను, ప్రభావాన్ని కలిగి ఉంటుంది. మనం ఆధ్యాత్మిక నాయకులమేనా?

*దేవుని కొరకు గొప్పకార్యములు చేసిన పరాక్రమశాలులు అందరూ బలహీనమైన మనష్యులే ఎందుచేతననగా దేవుడు వారితో ఉన్నాడని వారు నమ్మారు. – జె. హడ్సన్ టేలర్*

ప్రత్యేకం



# పరిచర్యకు దర్శనం ప్రభువు సన్నిధిలోనే...

**ప్రభువు పనిని చేయడం వేరు, దానిని దేవుడిచ్చిన దర్శనంతో చేయడం వేరు.**

దేవుని వాక్యంలో-గొప్ప కార్యాలు సాధించిన దైవజనులు దేవుని సన్నిధిలో జీవించిన వారే. మనం తరచూ మాట్లాడే పరిచర్య మనుషుల ప్రణాళికలు, సలహాల వల్ల పుట్టింది కాదని మనం తెలుసుకోవాలి. అది సాక్షాత్తూ దేవుడిచ్చిన పరిచర్య. అదే నిజమైతే, ఈ పరిచర్యను మనం ఆకళింపు చేసుకోవడానికి, ఎప్పుడు ఎక్కడ ఎలా ప్రభువు పనిని చేయాలని ప్రభువు కోరుతున్నాడో తెలుసుకోవడానికి మనం దేవుని సన్నిధిని కాంక్షించాలి. దేవునికి ఆయన వాక్యానికి సమీపంగా జీవించకుండా ఎవరైనా ఆయన పనిని ఎలా చేయాలో ఎలా తెలుసుకొంటారు?

ప్రభువు పనిని చేయడం వేరు, దానిని దేవుడిచ్చిన దర్శనంతో చేయడం వేరు. కొన్నిసార్లు మనం పరిచర్యను ఒక సైద్ధాంతిక అభ్యాసంగానే చూస్తూ ఉంటాం. దేవుని పనిని దేవుడు చూసినట్టు చూడటమే దర్శనం అంటే. ఇంకా చెప్పాలంటే, క్రైస్తవ పరిచర్య ప్రాముఖ్యతను, అత్యవసరతను, దాని ఉన్నతమైన పిలుపును మన హృదయాలు పుణికిపుచ్చుకోవాలన్నమాట. అంటే మనం దేవుని పరిచర్యలో భాగస్వాములం కావడం ద్వారా ఆయన జతపనివారిగా మన హృదయాల్లో ఆ పరిచర్య భారాన్ని అనుభవిస్తామని అర్థం. మన తరంలో దేవుని కదలికల్ని మనం అర్థం చేసుకోవడం ప్రారంభిస్తాం. ఓ పక్క ప్రజల్ని రక్షించడంలో, మరోపక్క ఆయన సంఘాన్ని కట్టడంలో ఆయన కదలికల్ని అర్థం చేసుకొంటాం. అంతేకాదు, సువార్త పని ప్రతి క్రైస్తవునికి తప్పనిసరి బాధ్యత అని గుర్తిస్తాం. అందుకోసం మనస్ఫూర్తిగా మనకు దేవుడు అప్పగించిన ఆ వ్యక్తిగత బాధ్యతకు అంకితం కావడమే సువార్త పరిచర్య అని అర్థం చేసుకోవడమూ, ఆ దర్శనాన్ని పొందడంలో భాగమే. ఒక్క మాటలో చెప్పాలంటే దేవుని ప్రణాళికలో మన స్థానాల్ని (లేక పాత్రని) అర్థం చేసుకోవడం దైవ దర్శనాన్ని పొందడంలో కీలకమైంది.

**అబ్రాహామును** దేవుడు తన స్నేహితునిలా చూశాడు. గనుకనే తాను తలపెట్టిన విషయాల్ని అతనికి చెప్పడానికి ఇష్టపడ్డాడు. దేవుడు అబ్రాహాముతో చెప్పిన విషయాలన్నీ గంభీరమైనవే. అవి మానవ పరిధిలో అబ్రాహాము అర్థం చేసుకోవడానికి సాధ్యంకానివి. అయినప్పటికీ, దేవునితో తనకున్న సాన్నిహిత్యాన్ని బట్టి అబ్రాహాము విశ్వాసంతో కొంత మేరకైనా వాటిని అర్థం చేసుకోగలిగాడు. అంతేకాదు, దేవుని ప్రణాళికకు అనుగుణంగా అతడు తన జీవితాన్నంతటినీ నియంత్రించుకోగలిగాడు.

దేవుని సన్నిధిలో జీవించిన దైవజనులు, వారందించిన అసలైన దర్శనమే యుఇయస్ఐలో మనకు సంక్రమించిన ఆస్తి. ఐతే మనం అంతగా వారి అడుగుజాడల్లో నడుస్తున్నట్టు కనిపించడం లేదు. మనలో చాలామంది అర్థవంతమైన క్వైట్ టైమ్స్ చేసుకోవడంలో బలహీనంగానే ఉన్నాం. అడపా దడపా కొన్ని సందర్భాలు తప్పించి మన ప్రార్థనా సమావేశాలు ఎక్కువగా యాంత్రికంగానే ఉన్నాయి. అద్భుతమైన గతం ఉన్నా, ఆ తృష్ణ, దార్శనికత లోపించిన ప్రజలంగా ప్రస్తుతం మనం వేగంగా మారిపోతున్నట్లనిపిస్తోంది. కొన్నిసార్లు మన ప్రభువును మనం పోగొట్టుకొంటున్నాం. ఎందుకంటే ఆయనిచ్చే భవిష్యత్ జ్ఞానం ఆదేశాల కోసం తదేకంగా ఆయన ముఖంలోకి చూడకుండా మన సొంత కార్యకలాపాల్లో తలమునకలైపోయాం.

**నెహెమ్యా** రాజ సౌధంలో పనిచేస్తూనే శిథిలమైన యెరూషలేమును కట్టాలనే దేవుని పిలుపుకు సునిశితంగా స్పందించాడు (నెహె 1:4-11). అందుకోసం అతడు దేవుని సన్నిధిలో గడిపి నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చింది. దశాబ్దకాలంగా ఎన్నో త్యాగాలు చేస్తూ, రకరకాల వ్యక్తులనూ, అపహాస్యాలనూ, శోధనలనూ తట్టుకొంటూ దృఢమైన అంకిత భావంతో వెట్టి చాకిరి చేయాల్సి వచ్చింది. నెహెమ్యా రాజప్రాసాదంలోనే కాదు దేవుని సన్నిధిలో సైతం జీవించాడని ఆయన జీవితం చెబుతోంది. దేవుని సాయంతో, జ్ఞానంతో మాత్రమే చేయగల పనులకు దేవుడే వ్యక్తుల్ని శక్తిమంతులుగా చేస్తాడు.


**దానియేలు** ఎంతో ప్రార్థనాపూర్వకంగా జీవించేవాడు. రాజ్యంలో అత్యున్నత అధికారంలో



ఉంటూ కూడా అతడు దేవుని కోసం జీవించడంలో విపరీతమైన జాగ్రత్తలు తీసుకొన్నాడు. తనకి కానీ, రాజ్యానికి కానీ ఏం జరుగబోతుందో అతనికి పూర్తిగా తెలిసి ఉండక పోవచ్చు. ఐతే చరిత్రలో, తన జీవితంలో దేవుని కదలికల్ని పసిగడుతూ వాటి కోసం సిద్ధపడ్డాడని నిశ్చయంగా చెప్పగలం. అతడు తన దేవుని సన్నిధిలో తరచూ క్రమంగా ప్రార్థిస్తూ గడిపేవాడని మనకు తెలుసు (దాని. 6:10). అందుచేత అతని జీవిత మలి దశలో భవిష్యత్ గురించిన గొప్ప సంగతులను దేవుడు అతనికి ప్రత్యేకంగా ప్రత్యక్షం చేశాడు (దాని. 9:22-23).

**అపోస్తలులు** దేవునితో ఏకాంతంగా గడిపినట్టు బైబిల్ చెబుతోంది (అ.కా 18:1-8). వారంతా తీవ్రంగా దేవుని సన్నిధిని కాంక్షిస్తున్న సమయంలో దేవుడు వారికి తన ప్రణాళికల్ని తెలియజేశాడు. ఆ తర్వాత అపోస్తలుల కార్యాలు 16:6-10లో ఆసియా మైనర్‌లోని ఇతర ప్రాంతాలకు వెళ్ళకుండా దేవుడు అడ్డగించినందున పౌలు మాసిదోనియాలో పరిచర్యకు పిలుపునందుకొన్నాడు.

**మన ప్రభువే** ఎక్కువ సమయం, ముఖ్యంగా రాత్రి కాలంలో, దేవునితో ఏకాంతంగా గడిపినట్టు పదే పదే బైబిల్లో రాసి ఉంది. ఆయన పరిచర్యలో ప్రధాన ఘట్టం లేక నిర్ణయం జరుగక ముందు ఆయన ప్రార్థన చేసినట్టు, తన పరలోక తండ్రితో గడిపినట్టు మనం చూస్తాం (మార్కు 1:35; 6:46 లూకా 4:43; 5:15-16; 6:12).



**తనకు నమ్మకస్తులుగా ఉన్నవారికి, ప్రతీ దానికి తననే నమ్ముకొనే వారికి, దేవుని వాక్యం ద్వారా ఆయన ఆత్మ దయచేసిన ధైర్యం గల వారికి, మనుషులతో కంటే దేవునితో గడపడమే అధిక ప్రాధాన్యతగా పెట్టుకొన్న వారికి దేవుడు తన ప్రణాళికలు తెలియ చేస్తాడు.**

**సంఘపితరుల** జీవితాలను పరిశీలిస్తే వారు దేవునితో సాన్నిహిత్యం గలిగిన వ్యక్తులని తెలుస్తుంది. చరిత్రలో దీనికెలాంటి మినహాయింపులు లేవు. ఎందుకంటే, దేవునితో సమీపంగా మెలగని వారు దేవుని పనిలోని లోతుపాతుల్ని ఆకళింపు చేసుకోలేరు, ఆయన ఉద్దేశాల్ని, విధానాల్ని, సమయాల్ని అర్థం చేసుకోలేరు. సవాళ్ళను ఎదుర్కొనే సామర్థ్యాల్ని పొందలేరు, మూల్యాన్ని చెల్లించడానికి సిద్ధం కాలేరు, ప్రభువు పనిలో పోరాటాలు చేసే శక్తిని పొందలేరు. అంతేకాదు, మనల్ని ఊహకందని ఆధ్యాత్మిక శిఖరాలకు తీసుకెళ్ళే జీవం గల దేవుని విపరీత శక్తిని తట్టుకోగల సిద్ధపాటు వారికి ఉండదు. గొప్ప వ్యక్తుల జీవితాల్లో దేవుని సన్నిధి గూర్చిన అనుభవం చాలాసార్లు సంతోషకరమైన అనుభూతి కాదు. అది వారిని వణికింప చేసింది. ఐతే అదే అనుభవం దేవుని ముందు వారిని యోగ్యులుగా నిలబెట్టింది. ఇలాంటి అనుభవం మనకూ అవసరమే.

తనకు నమ్మకస్తులుగా ఉన్నవారికి, ప్రతీ దానికి తననే నమ్ముకొనే వారికి, దేవుని వాక్యం ద్వారా ఆయన ఆత్మ దయచేసిన ధైర్యం గల వారికి, మనుషులతో కంటే దేవునితో గడపడమే అధిక ప్రాధాన్యతగా పెట్టుకొన్న వారికి దేవుడు తన ప్రణాళికలు తెలియజేస్తాడు. అంతర్దృష్టి, అంతర్ ప్రత్యక్షతలు ఆ తర్వాత బహిరంగ ప్రకటనలుగా మారి పోతాయి. ఈ ప్రకటన ప్రభావితంగా జరగాలంటే అంతర్శక్తి, దృధ సంకల్పం అవసరం. ఎందుకంటే ఈ ప్రకటన ప్రజల హృదయాల్ని మార్చడానికి చేసేది కాబట్టి.

దేవుని సన్నిధిలో జీవించిన దైవ జనులు, వారందించిన అసలైన దర్శనమే యుఇయస్ఐలో మనకు సంక్రమించిన ఆస్తి. ఐతే మనం అంతగా వారి అడుగుజాడల్లో నడుస్తున్నట్టు కనిపించడం లేదు. మనలో చాలా మంది అర్థవంతమైన క్వైట్ టైమ్ చేసుకోవడంలో బలహీనంగానే ఉన్నాం. అడపా దడపా కొన్ని సందర్భాలు తప్పించి మన ప్రార్థనా సమావేశాలు ఎక్కువగా యాంత్రికంగానే ఉన్నాయి. అద్భుతమైన గతం ఉన్నా, ఆ తృష్ణ, దార్శనికత లోపించిన ప్రజలంగా ప్రస్తుతం మనం వేగంగా మారిపోతున్నట్లనిపిస్తోంది. కొన్నిసార్లు మన ప్రభువును మనం పోగొట్టుకొంటున్నాం. ఎందుకంటే ఆయనిచ్చే భవిష్యత్ జ్ఞానం ఆదేశాల కోసం తదేకంగా ఆయన ముఖంలోకి చూడకుండా మన సొంత కార్యకలాపాల్లో తలమునకలైపోయాం. గనుక మనం సరైన దర్శనాన్ని పుణికిపుచ్చుకోకపోతే మనం మరో క్రీస్తును, మరో సువార్తను ప్రకటించే ప్రమాదముంది (2 కొరిం. 11:4). ప్రతీ చిన్న విషయంలో మనం అయోమయానికి గురౌతాం. ప్రయోజనం లేని పనులు చేసి మన వనరుల్ని చివరికి జీవితాన్నే వృథా చేసుకొంటాం.

ప్రభువు మహిమాన్విత సన్నిధిలో దర్శనాన్ని సంపాదించుకొన్న దైవజనుల ఉదాహరణలు దేవుని వాక్యంలో కోకొల్లలుగా ఉన్నాయి. పరిచర్య దర్శనాన్ని పొందడం వారికి ఒకనాటి అనుభవం కాదు, అది వారి జీవితంలో తరచూ జరిగే ప్రక్రియ. ముఖ్యంగా పెద్దలు నాయకుల విషయంలో ఇది మరీ నిజం. వారు పొందిన దర్శనాలు వారి జీవితాలపై, ప్రజల జీవితాలపై విపరీత ప్రభావాన్ని చూపించాయని లేఖనాల్ని పరిశీలిస్తే మనకు అర్థం అవుతుంది.

నేటి తరంలో మనల్ని నమ్మి ప్రభువు అప్పగించిన ఈ పరిచర్యకు తాజాగా దర్శనాన్ని పొందడానికి మనం ఏకాంతంగా ఆయన సన్నిధికి వెళ్ళడానికి ఖచ్చితంగా ఇది సమయమే.

**– విజ డెస్క్**

# కోశాధికారి లేఖ

## ధనమెక్కడో - హృదయము అక్కడే

క్రీస్తునందు ప్రియమైన యుఇయస్ఐ-ఏపిలోని కోశాధికారులందరికి, సభ్యులకు
మన ప్రభువును రక్షకుడునైన యేసు క్రీస్తు నామములో శుభాకాంక్షలు.

"మీ ధనమెక్కడ ఉండునో అక్కడనే మీ హృదయము ఉండును" - లూకా 12:34

ధనానికి, హృదయానికి మధ్య విడదీయలేని బంధం ఉంది. ధనమెక్కడో హృదయము అక్కడే. హృదయము ఎక్కడో - ధనం కూడా అక్కడే అన్న విషయం విస్పష్టం. అయితే పరలోక సంబంధ విషయాలు కోసం ఎక్కువగా ఆలోచిస్తే పరలోక సంగతుల కోసం ధనాన్ని వెచ్చిస్తాం. ఒకవేళ భూలోక సంబంధ విషయాల కోసం ఎక్కువగా ఆలోచిస్తే ఇహలోక సంగతుల కోసం ధనాన్ని వెచ్చిస్తాం. పరలోకసంబంధ విషయాలకోసం ధనం హెచ్చించడం పరలోకమందు అక్షయమైన ధన సంపాదనే. - లూకా 12:33

భూమి మీద మీ కొరకు ధనమును కూర్చుకొనవద్దు; ఇక్కడ చిమ్మెటయు, తుప్పును తినివేయును, దొంగలు కన్నము వేసి దొంగిలెదరు - మత్తయి 6:19

జాన్‌వెస్లీ భక్తుడు అన్నట్లు క్రైస్తవ విధానంలో ఇచ్చే ప్రతి బహుమానం పరలోకపు బ్యాంకులో పెట్టుబడే. పరలోక బ్యాంక్‌లో ఉన్న వడ్డీరేటు భూలోకంలోని అన్ని బ్యాంక్‌ల కన్నా ఎక్కువే.

కొంతమంది ఇయు, ఇజియఫ్ సభ్యులకు తరచుగా వచ్చే ప్రశ్న నా ధనం ఎక్కడ ఇవ్వాలి? దీనికి ఒక సీనియర్ గ్రాడ్యుయేట్ సమాధానమిస్తూ..."నా దర్శనం ఎక్కడైతే అదే దేవుడు నన్ను పిలిచిన నా పరిచర్య. నా పరిచర్యలో నా హృదయం ఉంటుంది. అక్కడే నా ధనం ఎక్కువగా వాడతాను" అని అన్నాడు. వాస్తవానికి పరిచర్య దేవునిదే. ధనం దేవునిదే. కావున విద్యార్థుల మధ్య రాజ్య నిర్మాణంలో మన హృదయాన్ని కుమ్మరిద్దాం. అక్కడే దేవుడిచ్చిన ధనాన్ని విరివిగా దేవుని పనికోసం వాడదాం.

**స్తుతించండి**

1. మన స్టాఫ్‌కు 100% శాలరీ, అలవెన్స్‌లు ఇవ్వడానికి ప్రభువు చూపిన కృపను బట్టి

**ప్రార్థించండి**

1. యుఇయస్ఐ-ఏపి ఏసియం-2022 తర్వాత పెరిగిన 16.53% బడ్జెట్‌కు అనుగుణంగా ఇజియఫ్‌లు కాంట్రిబ్యూషన్స్ పెంచి పంపేటట్లు
2. స్టెరెట్ బ్లాక్ రిపేర్ వర్క్స్ కోసం 8 లక్షలు, చాందపిళ్ళ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ రిపేర్ వర్క్స్ కొరకు 5 లక్షలు అవసరం
3. యుఇయస్ఐ నేషనల్ వేతన సవరణలకు అనుగుణంగా మన స్టాఫ్‌కు కూడా వేతనాలు పెంచడానికి ఏసియం 2022 నిర్ణయించింది. దీని అవసరత ప్రతి నెల రూ. 70,000/- పెరుగుతుంది.
4. స్టాఫ్‌కు ఐదు ల్యాప్‌టాప్‌లు సబ్సిడీలో ఇవ్వడానికి అవసరమైన 1,20,000/- కొరకు

ఇట్లు
క్రీస్తులో మీ సహోదరుడు

**యస్.ఆర్.డి. కిషోర్ కుమార్**

**AP MONTHLY REQUIREMENT – Rs. 11,41,000/- (16.53% Hike W.R.T present income)**
**MONTHLY REQUIREMENT FOR UESI NATIONAL – Rs. 4,32,000/-**
**TOTAL - 15,73,000**

### APRIL - 2023

| Receipts | | Payments | |
|---|---|---|---|
| Opening Balance | | Field Staff Salaries | 5,14,740.00 |
| General Fund | 15,06,948.00 | Field Staff HRA, CA, MA & TA | 2,77,948.00 |
| Staff Support | 35,000.00 | Office Staff Salaries | 1,58,029.00 |
| | | UESI | 4,00,000.00 |
| | | Rajasthan | 30,000.00 |
| | | Jammu & Kashmir | 15,000.00 |
| | | APEGF | 3,000.00 |
| | | Girls Depatment | 3,500.00 |
| | | To Gratuity | 50,000.00 |
| | | To SWF | 61,164.00 |
| | | Office Expenditure | 28,567.00 |
| **Total** | **15,41,948.00** | | **15,41,948.00** |

Registered with the Registrar of News Papers of India **RNI No. 52991/94**
Postal Registration No. : **GTR/59/2021-2023**

**Date of Printing: 25-05-2023**
**Date and place of posting: 27th and 28th of every month at GUNTUR RMS**

Printed at Bhashyam Publishers, Amaravathi Road, Guntur 522 007. by Mr. P. Basavaiah
Edited by Mr. B.J. Lazarus and published by UESI-AP, Nambur - 522 508

# నాయకుడంటే నీలా వుండాలి!

ఎన్నివేల మెట్లు దిగి వచ్చావో
చివరి మెట్టుమీద నన్ను కలవడానికి
అందరూ నాలో మట్టినే చూశారు
నువ్వు మాత్రం మెరుపును చూశావు

నకిలీ నాయకులంతా
పొడవాటి అంగీలుగా మారి
అంత:పురాల చుట్టూ అల్లుకుంటూవుంటే
నువ్వు మాత్రం
మురికి వాడల మధ్య
వజ్రాల్ని సానబెడుతూ కనిపించావు

సత్య సూత్రాల్ని
ఉపమానాల ఊటలుగా మార్చి
మా ప్రాణనాడుల్లోకి ప్రవహింపజేశావు
నువ్వు వదలి వెళ్లే దూరాల్ని మేము చేరేలా
నువ్వు విత్తివెళ్లే పంటను మేము కోసేలా
విశ్వదర్శనాన్ని మాలో విస్తరింపజేశావు

దయ్యం చేతిలో ఓడినప్పుడు
అవిశ్వాస అలలకింద మునిగినప్పుడు
పనికిరాని మా ప్రగల్భాలను వెక్కిరిస్తూ
కోడి మూడుసార్లు కూసినప్పుడు
అస్తమించిన మా ఆత్మస్థైర్యం మీద
ఆశల పొద్దయి పొడిచావు

నమ్రత నాయకుని లక్షణమని
నీ చేతిలో నీళ్ల గిన్నె చూశాకే తెలిసింది
లేకపోతే కుర్చీలు కిరీటాలే
మా నాయకత్వ నిర్వచనాలు

మమ్మల్ని కట్టడానికే గదా
నువ్వు గోధుమ రొట్టెలా విరిగిపోయావు
జట్టును పచ్చని చెట్టులా నిలబెట్టడానికి
నువ్వు ఎండిన కొయ్య మీద ఒరిగిపోయావు

అధికార వికార రూపాల
పీడకలలు మా నాయకులు!
పదవుల్ని గెలిచారు తప్ప
హృదయాల్ని కాదు
నువ్వు మాత్రం సేవకనాయకుడివై
ప్రపంచాన్నే గెలిచావు

నాయకత్వ చరిత్రలో
నువ్వో కొత్తశకం
నాయకత్వ పుటల్లో
నీదే అసలు సంతకం

– ప్రసాద్ తాళ్ళూరి

